జిల్లాలో 93.79 శాతం పింఛన్ల పంపిణీ

అనకాపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం ఉదయం నుంచి రాత్రి 7 గంటల వరకు 93.79 శాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశామని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 2,56,820 మంది లబ్ధిదారులకు గాను రాత్రి 7 గంటల వరకు 2,40,878 మందికి (93.79 శాతం) పింఛన్లు పంపిణీ చేశామన్నారు. ఆ సమయంలో ఇళ్లలో లేని వారికి మాత్రమే పింఛన్ల పంపిణీ జరగలేదన్నారు. మిగతా వారికి ఈ నెల 5వ తేదీలోగా పింఛన్ల మొత్తాన్ని అందిస్తామని తెలిపారు.

తుఫాన్ చేసిన గాయాలు

జిల్లాలో పలు ప్రధాన రహదారులపై భారీగా గోతులు

- దెబ్బతిన్న 13 కల్వర్టులు
- ఆర్ అండ్ బీ రోడ్ల మరమ్మతులకు రూ.3.5 కోట్లు
- కొత్త రోడ్లు వేయాలంటే రూ.17.5 కోట్లు అవసరమని ప్రభుత్వానికి నివేదిక

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని పలు ప్రధాన రహదారులు ఛిద్రమయ్యాయి. ఆర్ అండ్ బీ రోడ్లపై పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో రాకపోకలకు వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు.



ఎస్.రాయవరం మండలం అడ్డరోడ్డు జంక్షన్ నుంచి నర్సీపట్నం వెళ్లే మార్గంలో గుమ్ములూరు వద్ద ఏర్పడిన గోతులు

జిల్లాలో సుమారు 366.92 కిలోమీటర్ల పొడవు గల రోడ్లు 79 చోట్ల పూర్తిగా దెబ్బతిన్నాయని ఆర్ అండ్ బీ ఇంజనీర్లు తేల్చారు. అనకాపల్లి, చోడవరం, సబ్బవరం, బుచ్చెయ్యపేట, ఎలమంచిలి, పరవాడ, ఎస్.రాయవరం, నక్కపల్లి, కె.కోటపాడు, నర్సీపట్నం, చీడికాడ, మునగపాక, కశింకోట, నాతవరం, అచ్యుతాపురం మండలాల్లో ఎక్కువగా ఆర్ అండ్ బీ రోడ్లు ధ్వంసమయ్యాయి. తుమ్మపాల దాటిన తరువాత మార్టూరు జంక్షన్‌లో అడుగు లోతు గొయ్యి ఏర్పడింది. ఇక్కడ తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మామిడిపాలెం, దర్శీనగర్ పరిసరాల్లోని రోడ్డు దుస్థితి దయనీయంగా మారింది. చోడవరం నుంచి వడ్డాది, కాశీపురం వరకు వెళ్లే రోడ్డు పరిస్థితిని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ రోడ్డుపై ప్రయాణమంటే జనం బెంబేలెత్తిపోతున్నారు. భారీ వర్షాల వలన పలు మండలాల్లో ఆర్ అండ్ బీ రోడ్లలోని 13 కల్వర్టులు పూర్తిగా దెబ్బతిన్నాయి. జిల్లాలో భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలంటే కనీసం రూ.3.5 కోట్లు అవసరమని, దెబ్బతిన్న రోడ్ల స్థానంలో శాశ్వత మరమ్మతులు చేపట్టి కొత్తగా రోడ్లు వేయాలంటే కనీసం రూ.17.5 కోట్లు అవసరమని ఇంజనీరింగ్ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ నివేదికను కలెక్టర్ ద్వారా ఆర్ అండ్ బీ ఇంజనీర్లు ఇప్పటికే ప్రభుత్వానికి పంపారు. ఆర్ అండ్ బీ రోడ్లతో పాటు మండలాల్లోని పలు పీఆర్ రోడ్లు వర్షాలకు దెబ్బతిన్నాయి. రోలుగుంట, రావికమతం మండలాల్లో ఇటీవల నిర్మించిన అనేక కొత్త రోడ్లు వర్షాలకు దెబ్బతిన్నాయి. పలు రోడ్లు కోతకు ... మిగతా 8వ పేజీలో

సెజ్ రోడ్లు ఛిద్రం

అచ్యుతాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) రోడ్లు గోతులమయమయ్యాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అచ్యుతాపురంలో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరుగుతుండడంతో ట్రాఫిక్‌ను అచ్యుతాపురం-ఎలమంచిలి రోడ్డులో గల రాంబిల్లి మండలం వెంకటాపురం జంక్షన్, అచ్యుతాపురం మండలంలో గల సెజ్ పునరావాస కాలనీ మీదుగా మళ్లించారు. ఈ రోడ్డు గుండా సెజ్ కర్మాగారాలకు అవసరమైన ముడిసరుకు, నిర్మాణ సామగ్రిని తరలించే భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాగే అచ్యుతాపురం అయ్యప్పస్వామి ఆలయం ఎదురుగా గల మార్టూరు జంక్షన్ నుంచి మార్టూరు మీదుగా మరికొన్ని వాహనాలను సెజ్‌లో కర్మాగారాలకు పంపుతున్నారు. మార్టూరు మీదుగా వెళ్లే రోడ్డు చాలా ఇరుకు, కానీ సెజ్ పునరావాస కాలనీ మీదుగా వెళ్లే రోడ్డు చాలా వెడల్పుగా ఉంటుంది. అయితే భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు గోతులమయమైపోయాయి. దీనికి తోడు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇవి మరింత పెద్దవిగా తయారయ్యాయి. దీంతో తేలికపాటి వాహనాలు సైతం రాకపోకలు సాగించలేని పరిస్థితి తలెత్తింది. అధికారులు స్పందించి ఈ గోతులను పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు.



యోకోహామా టైర్ల కర్మాగారం దాటిన తరువాత మలుపు వద్ద రోడ్డు దుస్థితి

భౌబోయ్

అరుస్తాయ్.. కరుస్తాయ్



- జిల్లాలో భయపెడుతున్న వీధి కుక్కలు
- గుంపులుగా వీధుల్లో సంచారం
- ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులను వదలని వైనం
- గత నాలుగు నెలల్లో 5,580 మందికి కుక్కకాటు
- జంతు సంరక్షణ సంస్థల చర్యలతో కుక్కల నియంత్రణపై అధికారులు వెనుకడుగు


నర్సీపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. గత నాలుగు నెలల వ్యవధిలో జిల్లాలో 5,580 మందిని కుక్కలు కరిచాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కుక్కలను నియంత్రించాలని అధికారులు భావిస్తున్నా జంతు సంరక్షణ సంస్థల చర్యలతో వెనుకడుగు వేస్తున్నారు. దీని వలన జనం ఇబ్బందులు పడుతున్నారు.



నర్సీపట్నంలో గుంపుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

జిల్లాలో పలు చోట్ల వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. వాహనచోదకులు, పాదచారులను వెంబడిస్తున్నాయి. చిన్నారులను సైతం కరిచేస్తున్నాయి. గత నెలలో ఓ పిచ్చికుక్క రావికమతంలో స్వైరవిహారం చేసి రెండేళ్ల చిన్నారితో సహా 27 మందిపై దాడి చేసి గాయపరిచింది. వీరందరినీ నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. గత నెల 17వ తేదీన పిచ్చికుక్క గొలుగొండ మండలం పాకలపాడు గ్రామంలో ఇద్దర్ని కరిచి, రెట్టవానిపాలెంలో ఒక ఆవు, వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ విధమైన సంఘటన ప్రతి రోజూ ఎదురవుతున్నా పంచాయతీ, మునిసిపల్ అధికారులు ఏమీ చేయలేక పోతున్నారు. నాలుగు నెలల వ్యవధిలో జిల్లాలో 5,580 మందిని కుక్కలు కరిచాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోచ్చు. జంతువుల పై క్రూరత్వ నివారణ సంస్థ (ఎస్‌పీసీఏ)లో భాగమైన బ్లూక్రాస్ సంస్థ పేరు చెబితే అధికారులు భయపడుతున్నారు. కుక్కలు దాడి చేసి కరిచి గాయపరిచినా ఏమీ చేయలేని పరిస్థితి ఉంది. కుక్కలను పట్టుకునే సమయంలో చిన్న గాయమైనా ఆ సంస్థ కారణంగా కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని వాటి జోలికి వెళ్లడం లేదు. ఫలితంగా గ్రామాలు, పట్టణాల్లో గ్రామసింహాల బెడద రోజు రోజుకి పెరిగి పోతోంది. గుంపులు, గుంపులుగా తిరుగుతున్న కుక్కలను చూస్తే రోడ్డు మీదకు రావాలంటే భయపడే పరిస్థితి వచ్చింది. ద్విచక్రవాహనాలపై వెళ్లే వారిని వెంబడిస్తున్నాయి. దీంతో వేగం పెంచి వాహనచోదకులు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఈ ఏడాది జూలై నుంచి అక్టోబరు వరకు ... మిగతా 8వ పేజీలో



అనకాపల్లిలోని గాంధీనగరంలో విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి



అనకాపల్లిలోని దేమునిగుమ్మం ఆలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు

ఆలయాలకు కార్తీక ఏకాదశి శోభ

- భక్తులతో శ్రీవారి దేవాలయాలు కిటకిట

కార్తీక ఏకాదశి సందర్భంగా జిల్లాలోని వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు వచ్చి పూజలు చేశారు. మహిళలు ధ్వజస్తంభాల వద్ద దీపారాధన చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. - అనకాపల్లి టౌన్/ఆంధ్రజ్యోతి

ముత్యాలమ్మపాలెం తీరంలో విద్యార్థి గల్లంతు

- మరో నలుగురిని రక్షించిన మత్స్యకారులు

పరవాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలమ్మపాలెం సముద్ర తీరంలో సరదాగా గడుపుదామని వెళ్లిన ఐదుగురు విద్యార్థుల్లో ఒకరు గల్లంతు కాగా, మిగతా నలుగురిని మత్స్యకారులు రక్షించి ఒడ్డుకు చేర్చారు. ఈ సంఘటనకు సంబంధించి పరవాడ సీఐ ఆర్. మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తానాం గ్రామంలోని ప్రభుత్వ ... మిగతా 8వ పేజీలో



సూరెడ్డి భానుప్రసాద్ (ఫైల్ ఫొటో)

విపత్తుల నిర్వహణకు సమగ్ర ప్రణాళిక

తుఫాన్ సహాయక చర్యలు అభినందనీయం

- కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌ను ఎదుర్కొన్న అనుభవాలతో భవిష్యత్తులో విపత్తుల నిర్వహణకు మరింత సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం జిల్లా, మండల ప్రత్యేకాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. జిల్లాలో తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు జిల్లా, మండల ప్రత్యేకాధికారులు సిబ్బందితో కలిసి సమష్టిగా కృషి చేయడం వలన ఎటువంటి ప్రాణహాని జరగకుండా నివారించగలిగామన్నారు. తుఫాన్ కాలంలో అహర్నిశలు శ్రమించిన అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. విద్యుత్ శాఖాధికారులు ముందుగా సిద్ధం చేసుకున్న పరికరాలతో ఎక్కడా విద్యుత్ సమస్య తలెత్తకుండా చేయగలిగారన్నారు. వైద్య సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులను ముందస్తుగా ఆస్పత్రుల్లో చేర్పించి సుఖ ప్రసవం జరిగేలా తోడ్పాటు అందించారని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు నిరంతరాయంగా జలాశయాల వద్ద నీటిని దిగువ ప్రాంతాలకు వదులుతూ ప్రమాదాలు జరగకుండా పనిచేశారన్నారు. రెవెన్యూ, పోలీసు, ఇతరత్రా ... మిగతా 8వ పేజీలో





హాజరైన వివిధ శాఖల అధికారులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

కాశీబుగ్గ ప్రమాద బాధితుల పరామర్శకు మంత్రి లోకేశ్



విశాఖ విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న మంత్రి లోకేశ్

కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనలో బాధితులను పరామర్శించడానికి రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి, టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో శనివారం సాయంత్రం నాలుగు గంటలకు విశాఖ చేరుకున్నారు. ఆయనను ఎయిర్‌పోర్టులో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, తదితరులు కలిశారు. అనంతరం నారా లోకేశ్, కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, హోం మంత్రి వంగలపూడి అనిత రోడ్డు మార్గంలో కాశీబుగ్గ వెళ్లారు.

- విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

హోం మంత్రి అనితకు సీఎం అభినందన

పాయకరావుపేట/నక్కపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌లో ప్రజలకు అండగా నిలిచిన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పనితీరును ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభినందించారు. శనివారం అమరావతిలోని ఉండవల్లిలో గల సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు మొంథా ఫైటర్ పేరిట ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ప్రజా సేవలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చూపిన మార్గం తమకు దిశానిర్దేశమని ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నుంచి మొంథా ఫైటర్ ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న హోం మంత్రి అనిత

కొండకర్ల జంక్షన్ వద్ద ట్రాఫిక్‌జామ్

- అచ్యుతాపురం- అనకాపల్లి రోడ్డు విస్తరణ నేపథ్యంలో సమస్య
- గంటకు పైగా ఇరుపక్కలా నిలిచిపోయిన వాహనాలు
- ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు రంగంలోకి దిగిన ఎమ్మెల్యే



ట్రాఫిక్ స్వయంగా క్లియర్ చేస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

అచ్యుతాపురం రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని కొండకర్ల జంక్షన్ వద్ద శనివారం ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అచ్యుతాపురం- అనకాపల్లి రోడ్డు విస్తరణలో భాగంగా జరుగుతున్న పనుల కారణంగా ఈ పరిస్థితి ఏర్పడింది. ఉదయం తొమ్మిది గంటల సమయంలో జంక్షన్ వద్ద భారీ వాహనాలు ఎదురెదురుగా రావడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. సుమారు గంట పాటు ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి. కంపెనీలకు వెళ్లే ఉద్యోగులు, స్కూల్, కాలేజీలకు వెళ్లే విద్యార్థుల వాహనాలు అందులో చిక్కుకున్నాయి. ఇంతలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి హాజరై తిరిగి వస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ చూసి తన వాహనాన్ని దిగి ట్రాఫిక్‌ను చక్కదిద్దేందుకు స్వయంగా రంగంలోకి దిగారు. వాహనదారులకు సర్దిచెప్పడంతో పరిస్థితి మెరుగుపడింది. ఇంతలో బండారు రామకృష్ణ, అలుగు శ్యామ్ జోసఫ్ అనే ఇద్దరు అనకాపల్లిలో ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తమకు పరీక్షకు సమయం అయిపోతుందని ఎమ్మెల్యేను వేడుకున్నారు. వెంటనే ఆయన స్పందించి వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఆవ కాలువను పరిశీలించిన ఎమ్మెల్యే

మునగపాక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం మునగపాకలో నీటి ముంపునకు కారణమైన అనకాపల్లి ఆవకాలువను శనివారం ఎమ్మెల్యే విజయకుమార్ పరిశీలించారు. కాలువ గర్భంలో వ్యర్థాల కారణంగానే గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత మునగపాకలో నీటి ముంపునకు కారణం అయ్యాయని తెలిపారు. సాగునీటి కాలువలను నాశనం చేస్తుంటే ఏం చేస్తున్నారని కూటమి నాయకులను ఆయన ప్రశ్నించారు. నీటి సంఘం అధ్యక్షుడు నాయడు, సర్పంచ్ దిమ్మల అప్పారావు, శ్రీకాళహస్తి దేవస్థానం బోర్డు డైరెక్టర్ బీలా ప్రవంతి, డొక్కా నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

'స్త్రీతు' యాప్ రూపొందించిన ప్రశాంతి విద్యార్థులు



యాప్ రూపొందించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్

అచ్యుతాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు 'స్త్రీతు' మొబైల్ యాప్‌ను రూపొందించారు. దీనిని ఈ నెల 15న భువనేశ్వర్‌లో జరగనున్న ఐటీ రిఫ్లో మెనిస్ట్రీరియల్ హెల్త్ ఇన్నోవేషన్ హ్యాకతాన్-2025లో ఆవిష్కరించనున్నారని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. సైన్స్ విభాగానికి చెందిన విద్యార్థులు రూపొందించిన ఈ యాప్ కౌమార దశలో ఉన్న బాలికలు, రుతుక్రమ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న మహిళలకు పరిష్కారం చూపవచ్చన్నారు. కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు పవన్‌కుమార్ నల్లూరి ఆధ్వర్యంలో విద్యార్థులు శంకర్, కోటి, పూజలు ఈ యాప్ రూపకల్పన చేశారన్నారు. ఈ సందర్భంగా వీరిని ప్రశాంతి విద్యా సంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ అభినందించారు.

మొత్త'మొంథా' నీరే!

- జల దిగ్బంధంలో అచ్యుతాపురం మండల కాంప్లెక్స్
- కార్యాలయాలన్నీ ఒకేచోట ఉండడంతో సిబ్బంది, ప్రజలకు ఇబ్బంది



కార్యాలయాల ముందు బురదమయం



చెరువులా మారిన అచ్యుతాపురం మండల కాంప్లెక్స్ గ్రౌండ్

అచ్యుతాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు ఇక్కడి మండల కాంప్లెక్స్ ఆవరణ జలమయమైంది. వివిధ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నీరు నిలిచిపోయింది. దీంతో సిబ్బందితో పాటు వివిధ పనులపై కార్యాలయాలకు వచ్చే ప్రజలంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ఏ మండలంలో లేనివిధంగా అచ్యుతాపురంలో అన్ని కార్యాలయాలు ఒకే ఆవరణలో ఉన్నాయి. తహశీల్దార్, ఆర్‌డబ్ల్యూఎస్, పోలీస్ స్టేషన్, ఎంపీడీవో, ఎంఈవో, పీహెచ్‌సీ, జడ్పీ, వెలుగు, హౌసింగ్, గ్రంథాలయం, మత్స్యశాఖ, భవిత, 108 అంబులెన్స్ అత్యవసర సేవల కార్యాలయం, పోలీస్ గెస్ట్ హౌస్, అచ్యుతాపురం పంచాయతీ కార్యాలయం, పోలీస్ క్వార్టర్స్ ఇక్కడే ఉన్నాయి. వీటి మధ్యలో మండల కాంప్లెక్స్ గ్రౌండ్ ఉంది. ప్రతి రోజూ ఆయా కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వందల సంఖ్యలో వస్తుంటారు అలాగే ప్రతి రోజూ వాహనాలు కూడా ఎక్కువగానే వస్తుంటాయి. వాహనాలను మండల కాంప్లెక్స్ గ్రౌండ్‌లో పెట్టుకొని పనులు చూసుకొని వెళ్తుంటారు అయితే ఏమాత్రం వర్షం పడినా ఈ గ్రౌండ్ చెరువులా మారిపోతోంది. దీంతో చుట్టు పక్కల ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు ముంపుకు గురవుతున్నాయి. గత మూడు నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు ఈ ప్రాంగణం పూర్తిగా జలదిగ్బంధంలో ఉంది. దీంతో కార్యాలయాల్లోకి ఉద్యోగులు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. గ్రౌండ్ లోలెవెల్‌లో ఉండడంతో పాటు దీని చుట్టూ అపార్టుమెంట్లు ఏర్పాటు కావడంతో నీరుపోయే మార్గం మూసుకుపోయింది. ఈ పరిస్థితుల్లో నీరంతా భూమిలో ఇంకాలే తప్ప బైటకి పోయే మార్గం కానరావడం లేదు. ఫలితంగా ఇక్కడ అంతా ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నారు. దీనికితోడు దుర్వాసన మరింత దారుణంగా ఉంది.

అర్హులందరికీ పథకాలు

- పింఛన్ల పంపిణీలో సుందరపు, ప్రగడ



మునగపాకలో దివ్యాంగురాలి పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్



కొక్కిరాపల్లిలో పెన్షన్ అందిస్తున్న నానాజీ



అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేటలో వృద్ధురాలికి నగదు అందిస్తున్న ప్రగడ

మునగపాక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రం మునగపాక శెట్టిబలిజ కాలనీలో శనివారం పలువురు లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసి మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం గొప్పలే తప్ప ఏమీ చేయలేదన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఇటు అభివృద్ధి, అటు సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఎంపీడీవో ఎం.ఉషారాణి, కూటమి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, దాడి ముసిలినాయుడు, డొక్కా నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలను ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తోందని రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు తిమ్మరాజుపేటలో పలువురికి పింఛన్లను పంపిణీ చేసి మాట్లాడారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రజారంజక పాలన సాగిస్తున్నట్టు చెప్పారు. టీడీపీ మండల అధ్యక్షుడు పీలా తులసీరామ్, శివబాపు నాయుడు, జగ్గప్పారావు పాల్గొన్నారు.

ఎలమంచిలి : మునిసిపాలిటీ పరిధి కొక్కిరాపల్లిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ పంపిణీ చేశారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సంక్షేమ పథకాలను పక్కాగా అముల చేస్తున్నట్టు చెప్పారు. అలాగే, యర్రవరం వార్డులో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు కరణం రవికుమార్, బొద్దపు శ్రీనివాసరావు, కొక్కిరాపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ మోటూరు గోపి, పెదపల్లిలో మాజీ కౌన్సిలర్ బొద్దపు నాగేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దంట్ల వెంకట స్వామి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలంలోని జడ్.చింతువా పంచాయతీ కొండవారపాలెం, నేవీ కాలనీలలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, టీడీపీ రాంబిల్లి మండల అధ్యక్షుడు లాలం భరత్ పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. రాంబిల్లి మండల శాఖ మాజీ అధ్యక్షుడు రవిరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎరిపల్లి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో ఆలయాలు కిటకిట

ఎలమంచిలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్తీక శుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని పలు ఆలయాల్లో శనివారం విశేష పూజలు నిర్వహించారు. పట్టణంలోని కొత్తపేట రామలింగేశ్వర, సీతారాములు, త్రిమూర్తులు స్వామి ఆలయాలు, అలాగే కొక్కిరాపల్లి, పెదపల్లి, సోమలింగపాలెం, పులపర్తి, ఏటికొప్పాక, పోలిరెడ్డిపాలెం, పీఎన్‌ఆర్‌పేట తదితర గ్రామాల్లో వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ఎలమంచిలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర రాష్ట్ర సాధనకు ఆమరణ నిరహార దీక్ష చేసి, ప్రాణాలర్పించిన మహోన్నతుడు పొట్టి శ్రీరాములు అని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బి.ఎస్.బంగారుశెట్టి, మునిసిపల్ వైస్ చైర్మన్ గుప్తా అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎలమంచిలి దిమిలి రోడ్డు జంక్షన్‌లో శనివారం ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహనీయుల అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు కట్టా శ్రీను, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

త్రిమూర్తులు విగ్రహాల ప్రతిష్ఠ

మునగపాక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) ఇక్కడి సంతబయల చాకిరేవు ప్రాంతంలో త్రిమూర్తులు విగ్రహాలను శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. వడ్డెర కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్చకుడు వెలవలపల్లి కోటేశ్వర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్పీటీసీ పెంటకోట స్వామిసత్యనారాయణ, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీటీసీ సూరిశెట్టి రమణ, ఆడారి కాశిబాబు, సంఘ పెద్దలు కింతాడ మోహన్‌రావు, కుంది సూర్యనారాయణ, మహిళలు పాల్గొన్నారు.

పాఠశాలలో సరస్వతీదేవి, గాంధీ విగ్రహాల ఏర్పాటు

మునగపాక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తోటాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సరస్వతీదేవి, మహాత్మా గాంధీ విగ్రహాలను శనివారం ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవో బి.శివనాయుడు, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, దొడ్డి కోటేశ్వరరావు, దాతలు కొడుకుల విజయ్‌కుమార్, దొడ్డి బాలాజీ, హెచ్‌ఎం శివరామ ప్రసాద్, రెడ్డి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఫణిగిరి ప్రదక్షిణ పోస్టర్ ఆవిష్కరణ

రాంబిల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి రోజైన ఈనెల ఐదో తేదీన జరగనున్న ఉమాధర్మలింగేశ్వరస్వామి ఫణిగిరి ప్రదక్షిణను అంతా విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. పంచదార్ల పుణ్యక్షేత్రం ఆవరణలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాంబిల్లి మండల మాజీ అధ్యక్షుడు వి.దిన్‌బాబు, నాయకులు అనకాపల్లి ప్రసాద్, ద్వారపురెడ్డి నాగేశ్వరరావు, దిమిలి పీఏసీఎస్ చైర్‌పర్సన్ పి.శివశంకర్ తదితరులతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ప్రభుత్వ సాయం అభినందనీయం

- నాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు




మాట్లాడుతున్న నాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు

పాయకరావుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను సమయంలో వేటకు వెళ్లకుండా ఇళ్ల వద్ద ఉన్న మత్స్యకారులకు ప్రభుత్వ సాయం అందించడం అభినందనీయమని జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోసా అప్పలరాజు అన్నారు. శనివారం స్థానిక నాఫ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మోసా అప్పలరాజుతోపాటు పలువురు మత్స్యకార నాయకులు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సం దర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ 15 ఏళ్ల క్రితం తుపాను సమయంలో జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు అప్పటి ప్రభుత్వం బియ్యం, నిత్యావసర సరుకులు అందజేసి ఆదుకుందని తెలిపారు. ఇటీవల మొంథా తుపానుకి తీర ప్రాంత గ్రామాల్లో వేటకు వెళ్లకుండా ఉండిపోయిన మత్స్యకార కుటుంబాలకు ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం 50 కేజీల బియ్యంతోపాటు పప్పు, పంచదార నూనె తదితర నిత్యావసర సరుకులు అందజేసి ఆదుకుందన్నారు. ఈ కార్యక్రమంలో నాఫ్ పాయకరావుపేట, నక్కపల్లి మండల అధ్యక్షులు సూరాడ శ్రీనివాసరావు, ఎరిపిల్లి అప్పలరాజు, జిల్లా సంయుక్త కార్యదర్శి కోనాడ చిట్టెమ్మ, సభ్యులు వంకా లక్ష్మణ్, నాయకులు పిరాది చంటి పాల్గొన్నారు.

నిర్బంధానికి భయపడొద్దు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



దర్మవరం అగ్రహారంలో సీపీఎం నేత అప్పలరాజును కలిసిన కార్యదర్శి శ్రీనివాసరావు

ఎస్. రాయవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోలీసుల నిర్బంధాలకు భయపడవద్దని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. నక్కపల్లి మండలం, రాజయ్యపేట మత్స్యకారులు బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేక పోరాటానికి మద్దతుగా నిలిచిన సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం అప్పలరాజును పోలీసులు అక్కడికి వెళ్లనీయకుండా వారాల తరబడి గృహ నిర్బంధించడం, ఆయనపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదుచేయడంతో శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేంద్ర కమిటీ సభ్యుడు కె లోకనాదంఇద్దరూ మండలంలోని దర్మవరం అగ్రహారంలో ఉన్న అప్పలరాజు ఇంటిని సందర్శించారు. అప్పలరాజుకు అతడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలీసు కేసులు, గృహ నిర్బంధంతో అధైర్య పడాల్సిన అవసరం లేదని, పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని ఆయన భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



మంగవరంలో వేంకటేశ్వరస్వామి కళ్యాణంలో భక్తులు



రాయవరం వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో హరిభజన దృశ్యం

వైభవంగా కార్తీక ఏకాదశి పూజలు

ఎస్. రాయవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఏకాదశి పర్వదినాన్ని పలు గ్రామాల్లోని ఆలయాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు అడ్డరోడ్డు, దార్లపూడి, వమ్మవరం గ్రామాల్లో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు పూజల తరువాత ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించారు. వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులకు పండితులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక హరిభజన నిర్వహించారు.

వేంకటేశ్వర స్వామి కల్యాణం

పాయకరావుపేటం రూరల్: మండలంలో పలు గ్రామాల్లో శనివారం కార్తీక శుద్ధ ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. సత్యవరం, మంగవరం, పెదరాంభద్రపురం, తదితర గ్రామాల్లో ఉదయం నుంచి ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. భజనలు నిర్వహించారు. మంగవరంలోని పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వా మి వారి ఆలయంలో ఆలయ ధర్మకర్త తమ్మిడిశెట్టి అయ్యారావు ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలోపాల్గొన్నారు.

'మెడికల్ కాలేజీల్లో పీపీపీ విధానాన్ని విరమించుకోవాలి'



పోస్టర్లతో వైసీపీ నాయకులు

పాయకరావుపేట రూరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల్లో పీపీపీ విధానాన్ని విరమించుకోవాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు అన్నారు. మండలంలోని అరట్లకోట గ్రామంలో శనివారం ఈ మేరకు పార్టీ ఆదేశాలపై కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణతో పేద విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుందన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు గెడ్డమూరి శ్రీనువాసరావు, జడ్పీటీసీ సభ్యుడు లంక సూర్యనారాయణ, నాయకులు ధనిశెట్టి బాబూరావు, యిసరపు తాతారావు, మత్స్యకార కార్పొరేషన్ మాజీ డైరక్టరు చోడిపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు అభినందనలు

పాయకరావుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను సమయంలో స్థానిక తహసీల్దార్ ఎస్‌ఏ.మహేశ్వరరావు అహర్నిశలు పని చేశారు. శనివారం ఈ నేపథ్యంలో ఉండవల్లిలో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు నుంచి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు టీ డీపీ పాయకరావుపేట మండల అధ్యక్షులు చింతెలపు ప్రదీప్, పట్టణ పార్టీ అధ్యక్షులు యాళ్ల వరహాలబాబు, పలువురు నాయకులు తదితరులు అభినందనలు తెలిపారు.

ప్రజల రక్షణే ప్రభుత్వ లక్ష్యం

- టీడీపీ నియోజకవర్గం కన్వీనర్ వెంకటేశ్



చేనేత కార్మికులకు సరుకులను అందజేస్తున్న తహసీల్దార్ నర్సింహమూర్తి, టీడీపీ కన్వీనర్ వెంకటేశ్ తదితరులు

నక్కపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణ, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ అన్నారు. శనివారం మండలం డీఎల్‌పురం, నెల్లిపూడి, అమలాపురం గ్రామాల్లో మత్స్యకారులు, చేనేత కార్మికులకు ప్రభుత్వం మంజూరు చేసిన తుపాను నేపథ్యంలో నిత్యావసర సరకులను తహసీల్దార్ నరసింహమూర్తితో కలిసి వెంకటేశ్, టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. అనంతరం వెంకటేశ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, నెల్లిపూడి సర్పంచ్ కె.సురేశ్ వర్మ, వేంపాడు ఉప సర్పంచ్ అయినంపూడి అప్పలరాజు, వెలగా శ్రీను, గింజాల శ్రీను, గోసల చిన తాతారావు, సత్యనారాయణ, సింహాద్రి పాల్గొన్నారు.



యండపల్లిలో పింఛన్లుపంపిణీ చేస్తున్న టీడీపీ నేత కాశీనాయుడు

ఎస్. రాయవరం: అన్ని వర్గాల ప్ర జలు ఆర్థికంగా బాగుండాలన్నదే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారని మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకుడు యేజెర్ల వినోద్‌రాజు అన్నారు. మం డలంలోని పెదగుమ్ములూరులో జరిగిన పెన్షన్ల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు.

కోటవురట్ల:మండలంలో యండపల్లిలో పంచాయతీ కార్యదర్శి రవికిరణ్‌తో కలిసి టీడీపీ జిల్లా అధ్యక్షుడు లాలం కాశీనాయుడు పంపిణీ చేశారు.అలాగే టీకేపల్లిలో టీడీపీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ పెట్ల లింగంనాయుడు పంచాయతీ కార్యదర్శిలతో కలిసి పంపిణీచేశారు. కోటవురట్లలో టీడీపీ నేత జానకీశ్రీనివాసరావు. ఎంపీటీసీ సభ్యులు పి. సూర్యారావు పింఛన్లు అందించారు.

తుఫాన్ బాధితులకు నిత్యావసర సరకులు పంపిణీ

ఎస్. రాయవరం: మండలంలోని రేవుపోలవరం, కొత్తపోలవరంల్లోని తుఫాన్ బాధితులకు ప్రభుత్వం సరఫరా చేసిన 50 కిలోల బియ్యంతో పాటు కిలో నూనె, కిలో కందిపప్పు, బంగాళదుంపలు, పంచదార, ఉల్లిపాయలు తదితర నిత్యావసర సరకులను శుక్రవారం టీడీపీ తెలుగు యువత మండల అధ్యక్షుడు కోడ లోవరాజు, పలువురు నాయకుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లోవరాజు మాట్లాడుతూ ముంథా తుఫాన్‌లో హోం మంత్రి అనిత సూచనల మేరకు మండల అధికారులంతా అప్రమత్తమై ముందస్తు చర్యలు చేపట్టడంతో గ్రామాల్లో ప్రజలు సురక్షితంగా బయటపడ్డారన్నారు.

ఒంటరి మహిళకు హోం మంత్రి చేయూత

- సొంత నిధులతో పెన్షన్ అందజేత



కొత్తపోలవరంలో నూకాలమ్మకు నగదును అందజేస్తున్న టీడీపీ నేత వెంకటరాజు

ఎస్. రాయవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఓ ఒంటరి మహిళకు ఆర్థికసాయంతో చేయూత నందించారు. టీడీపీ మం డల మాజీ అధ్యక్షు డు నల్లపరాజు వెంకటరాజు అందించిన వివరాలివి... మండలంలోని బంగారమ్మపాలెంలో గురువారం హోం మంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. ఈ క్రమంలో కారే నూకాలమ్మ అనే ఒంటరి మహిళ తన ఆర్థిక పరిస్థితిని వివరించి పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. హోం మంత్రి త్వరలో నూతనంగా పింఛన్ మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. అయితే, అంత వరకు తన సొంత నిధులతో ప్రతీ నెలా ఆర్థిక సహాయం అందిస్తానని నూకాలమ్మకు హోం మంత్రి హామీ ఇచ్చారు. ఈమేరకు శనివారం ఒకటో తేదీ కావడంతో ఆమెకు తన సొంత నిధుల నుంచి రూ. 2 వేలు అందించారు. శుక్రవారం కొత్తపోలవరంలో ఆమెకు సొమ్ము అందించినట్టు వెంకటరాజు చెప్పారు. టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పాయకరావుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవంను శనివారం పట్టణంలో ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పొట్టి శ్రీ రాములు చిత్రపటానికి కూటమి నాయకులు తోట నగేశ్, చింతెలపు ప్రదీప్, పెదిరెడ్డి చిట్టిబాబు, యాళ్ల వర హాలబాబు, పెదిరెడ్డి శ్రీను, పల్లా విలియంకేరి, అంచటదొర తదితరులు పూల మాలలువేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు ఆం ధ్ర రాష్ట్ర కోసం ప్రాణాలు అర్పించారన్నారు. ఈ త్యాగానికి గుర్తుగా ఆయన జయంతిని ఏటా రాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. సేవా సంస్థ సభ్యులు కొత్తపల్లి చిట్టిబాబు, బాలేపల్లి చినబాబు, టిక్కలి వెంకటరామకృష్ణ, కె. లక్ష్మీనారాయణ, ఎం.నారాయణమూర్తి ఎస్. చలపతిరావు, వైపీఎస్.ప్రసాద్, పాల్గొన్నారు.

ఫోర్జరీ, ఛీటింగ్ కేసులో ఏడాది జైలు శిక్ష

నక్కపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి పోలీస్ స్టేషన్‌లో 2015లో నమోదైన ఫోర్జరీ, ఛీటింగ్ కేసులో నిందితుడికి ఎలమంచిలి ఏజేఎఫ్‌సీఎం కోర్టు ఏడాది జైలు శిక్ష, రూ 9వేలు జరిమానా విధించినట్టు శనివారం స్థానిక ఎస్‌ఐ సన్నిబాబు చెప్పారు. అప్పటి తహశీల్దార్ పి.సుందరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎల్.రామకృష్ణ న్యాయంపూడి గ్రామానికి చెందిన కె. వెంకటరమణపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. ఈ కేసు విచారణలో భాగంగా శుక్ర వారం ఎలమంచిలి కోర్టు జడ్జి ఈ తీర్పు వెల్లడించినట్టు వివరించారు.

అంగన్‌వాడీల్లో చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ: కలెక్టర్



చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల్లో రక్తహీనత రాకుండా సక్రమంగా పౌష్టికాహారం అందించాలని, అంతేకాకుండా వారి ఆరోగ్యాన్ని నిరంతరం పరిశీలించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. మండలంలోని శంకరం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. వారి పఠనాశక్తిని పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్యంపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బరువు తక్కువగా ఉండే చిన్నారులను గుర్తించి వారికి అదనపు పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

'అవినీతి నిర్మూలనకు యువత ముందుకు రావాలి'



విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ శంకర్

సబ్బవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అవినీతి నిర్మూలనకు యువత ముందుకు రావాలని ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్ పిలుపునిచ్చారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా కళాశాలలో శనివారం ఏర్పాటైన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. సమాజంలోని అన్ని వ్యవస్థలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎక్కడైనా అవినీతి, అక్రమాలు జరిగినట్టు తెలిస్తే వెంటనే విజిలెన్స్ విభాగం అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం అవినీతి నిర్మూలనపై విద్యార్థులు, అధ్యాపకులతో చర్చా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లెక్కల గణేష్, అధ్యాపకులు రజనీ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

తుమ్మపాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం పార్టీ నాయకులతో కలిసి తుమ్మపాలలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు చిత్తశుద్ధితో క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు పరిహారాన్ని అందజేయాలన్నారు. అత్యధికంగా వెంకుపాలెం, సీతానగరం, తగరంపూడి, ఊడేరు, శంకరం తదితర గ్రామాల్లో సుమారు నాలుగువేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని చెప్పారు. రియల్టర్లు ఎక్కడికక్కడ లేఅవుట్లు వేస్తుండడంతో నీరు ప్రవహించే అవకాశం లేకపోవడంతో పంట నష్టం అధికంగా ఉన్నట్లు వివరించారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యవర్గసభ్యులు డి.వెంకన్న, గంటా శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో బహుళ ప్రయోజనాలు

తుమ్మపాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పుస్తకాలు చదవడం ద్వారా బహుళ ప్రయోజనాలున్నాయని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు కె.లక్ష్మయ్య అన్నారు. అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో ప్రారంభమైన బుక్ ఫెస్టివల్‌లో ఆయన మాట్లాడారు. తొలిసారిగా అనకాపల్లిలో పుస్తక పఠన సంస్కృతిని పునరుద్ధరించేందుకు ఈ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలన్నారు. ఈనెల ఏడో తేదీ వరకు ఈ పుస్తక ప్రదర్శన కొనసాగుతుందని చెప్పారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనకాపల్లి పుస్తక ప్రదర్శన కన్వీనర్ ఉమా మహేశ్వరరావు, ప్రతినిధులు త్రిమూర్తులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రేవడి గ్రామంపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం'



రేవడి గ్రామస్థులను కలిసి రెవెన్యూ, పోలీసు అధికారులు

కొత్తూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం రొంగలివానిపాలెం పంచాయతీ రేవడి గ్రామస్థులను తుపాన్ సమయంలో అధికార యంత్రాంగం పట్టించుకోలేదన్న సోషల్ మీడియా ప్రచారం నేపథ్యంలో సదరు గ్రామాన్ని ఇన్‌చార్జి తహశీల్దార్ శాంతిభూషణ్, రూరల్ సీఐ అశోక్‌కుమార్, డీటీ శేఖర్ శనివారం సందర్శించారు. గ్రామంలో పదిహేను కుటుంబాలవారు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. తుఫాన్ల సమయంలో వెదుళ్ళగెడ్డ పొంగడం వల్ల తమకు రాకపోకలకు ఇబ్బంది తప్ప, మరే సమస్యలు లేవన్నారు. తుఫాన్‌కు ముందు పంచాయతీ, రెవెన్యూ అధికారులు తమ గ్రామానికి వచ్చి పునరావాస కేంద్రానికి రావాలని తమను కోరారన్నారు. ఆ సమయంలో ఐదు రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు తమ వద్ద సిద్ధంగా ఉంచుకున్నామన్నారు. తమకు ఆరువందల మీటర్ల దూరంలో వెదుళ్ళగెడ్డ ఉంటుందని, తమ గ్రామం ఎగువన ఉండడం వల్ల ఆ సమయంలో వసతి, ఆహారానికి ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. అందువల్లే పునరావాస కేంద్రానికి రాలేదని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి, వీఆర్వో భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్‌కు ఐదుగురు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

సబ్బవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా చీరాలలో ఈ నెల ఏడో తేదీ నుంచి జరగనున్న 42వ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు జిల్లా నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్టు టెన్నికాయిట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్‌వీ సత్యనారాయణ తెలిపారు. సబ్బవరం అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో శనివారం అంతర్ జిల్లాల జూనియర్ బాలుర టెన్నికాయిట్ జట్ల ఎంపికకు పోటీలు నిర్వహించామన్నారు. ఇందులో ఇక్కడి గురుకుల విద్యాలయం విద్యార్థి పి.సాగర్, పుప్పాటి అభినాష్, పి.ప్రవీణ్‌కుమార్, అలాగే దేవరాపల్లి అంబేడ్కర్ గురుకులం విద్యార్థి కె.ఇన్నోష్, అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల విద్యార్థి జి.ఆశ్లేష్‌కుమార్ ఎంపికైనట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ సీహెచ్.కేశవరావు, పీడీ ఉమామహేశ్వరరావు, సీఎల్ఎన్ ప్రసాద్, సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శి జి. కనకారావు తదితరులు అభినందించారు.

అదుపు తప్పి డివైడర్‌పై దూసుకుపోయిన లారీ

లంకెలపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాసిటీ ప్రధాన రహదారిలో శుక్రవారం రాత్రి పెను ప్రమాదం తప్పింది. ఎదు రుగా వస్తున్న కారును తప్పించే క్రమంలో ఓ లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. లంకెలపాలెం నుంచి ఫార్మాసిటీ వస్తున్న లారీ సరిగ్గా రాంకీ అగ్నిమాపక కేంద్రం సమీపంలోకి చేరేసరికి అదే మార్గంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించే క్రమంలో డివైడర్‌పై నుంచి దూసుకుపో చెట్టు ఢీకొట్టింది. దీంతో లారీ ముందు టైర్లు క్యాబిన్ నుంచి విడిపోయాయి. ముందు భాగం నుజ్జు యింది. డ్రైవర్ స్వల్పగాయాలతో బయట పడ్డాడు. అలాగే కారు కూడా అదుపు తప్పి పొదల్లోకి దూసుకుపోయింది. డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

కోటి కాంతులతో కార్తీకశుద్ధ ఏకాదశి

▸▸ భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు ▸▸ వేకువజాము నుంచి విశేష పూజలు ▸▸ శ్రీవారు, పరమశివుని దర్శనాలకు పెద్ద సంఖ్యలో క్యూ

అనకాపల్లి టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్తీకశుద్ధ ఏకాదశి సందర్భంగా శ్రీవారి ఆలయాలు భక్తులతో శనివారం కిటకిటలాడాయి. అనకాపల్లి పట్టణంలోని దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి, గాంధీనగరం శ్రీవారి ఆలయాల్లో వేకువజామున అర్చకులు సుప్రభాతసేవ, మంత్రపుష్పం, నక్షత్ర హారతి వంటి పూజలను జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వీరి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేమునిగుమ్మం ఆలయ ఈవో మురళీకృష్ణ, మాజీ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, అర్చకులు పులకండం గిరిబాబు, పులకండం ప్రసాద్‌బాబు ఏర్పాట్లను చేపట్టారు. గాంధీనగరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు రేజేటి చక్రవర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అధికసంఖ్యలో భక్తులు హాజరై దర్శించుకున్నారు.

గౌరీ పంచాయతన ఆలయంలో...

అలాగే గౌరీ పంచాయతన ఆలయంలో ఏకాదశి సందర్భంగా గౌరీపరమేశ్వరులు, లక్ష్మీనారాయణల కల్యాణాలు కన్నులపండువగా జరిపారు. అర్చకులు పల్లకీలో స్వామివారిని ఊరేగించారు. మళ్ల అప్పలనాయుడు, ఉషా రాణి గృహం వద్ద ఎదురు సన్నాహం, ప్రవచనాలు నిర్వహించారు. అంపోలు గోపాలకృష్ణ శర్మ, సూర్యనారాయణశాస్త్రి వేదమంత్రాల మధ్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కశింకోట వేంకటేశ్వర ధ్యాన మందిరంలో చందనం అలంకరణలో స్వామివారు

కన్యకాపరమేశ్వరి ఆలయంలో...

స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో రామకోటి స్థూపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1969లో రామానుజయ పెద్ద జీయర్‌స్వామి 108 రామకోటి స్థూపాలు స్థాపించగా, అందులో అమ్మవారి ఆలయంలో 104వ స్థూపం స్థాపించారు. రామకోటి వార్షికోత్సవం సందర్భంగా స్థూపం వద్ద సీతారాముల కల్యాణాన్ని కన్నులపండువగా జరిపారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు లక్ష్మాజీ, కవిత దంపతులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే శారదానది ఒడ్డున గల ఉమా సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవారి కల్యాణాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ధ్యాన మందిరంలో...

కశింకోట : ఇక్కడి వేంకటేశ్వర ధ్యాన మందిరంలో స్వామివారు చందనం అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చకులు రేజేటి చరణ్ ఆధ్వ ర్యంలో సుమారు 300 కేజీల చందనంతో స్వామిని విశేషంగా అలంకరించారు. వేకువజామున ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఐదు రోజుల పాటు వేంకటేశ్వరస్వామి ఈ అలంకరణలో దర్శనం ఇవ్వనున్నారు.





దేమునిగుమ్మం శ్రీవారి ఆలయంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అర్చకులు.., గౌరీ పంచాయతన ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఐయోడిన్ లోపంతో అనర్థాలు

▸▸ డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి

సబ్బవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఐయోడిన్ లోపం వలన కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి సూచించారు. ప్రపంచ ఆయోడిన్ లోప రుగ్మతుల నివారణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో శనివారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. మనిషి శరీరానికి అవసరమైన ఆయోడిన్ సరిపడా అందకపోవడం వలన థైరాయిడ్ గ్రంధి పనితీరు దెబ్బతిని హైపోథైరాయిడిజానికి దారి తీస్తుందన్నారు. మెదడు అభివృద్ధి ఐయోడిన్ అవసరని పేర్కొన్నారు. ఇది లోపిస్తే బాల్యంలో తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ఇంకా ఐయోడిన్ లోపిస్తే ఆయోడిన్ డెఫిషియన్సీ డిజార్డర్ అంటారన్నారు. అలసట, బలహీనత, అసహనం, బరువు పెరగడం తదితర అనేక రకాల రుగ్మతుల బారిన పడతారన్నారు. ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన



ఐయోడిన్ లోపం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్న డీఎంహెచ్‌వో

కలిగి ఉండాలని, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్తేరు రాణి, ఎంఈవో రవీంద్రబాబు, హెచ్ఎం తిరుపతిరావు, డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ విశ్వనాథం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎంగా ఉండడం ప్రజల అదృష్టం

▸▸ మొంథా తుఫాన్ బాధితులకు అండగా ప్రభుత్వం

▸▸ సహాయక సరకుల పంపిణీలో ఎమ్మెల్యే 'పంచకర్ల'

పరవాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు స్పష్టం చేశారు. మండలంలోని ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, జాలారిపేట మత్స్యకారులకు మంజూరైన తుఫాన్ సహాయక సరకులను శనివారం ఆయన ముత్యాలమ్మపాలెంలో పంపిణీ చేసి మాట్లాడారు. కష్టకాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉండడం ప్రజల అదృష్టమన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సీఎం ఆలోచనలు ఇతర రాష్ట్రాలకే ఆదర్శమని చెప్పారు. నాడు హుద్‌హుద్- నేడు మొంథా తుఫాన్ ఇలా ఏదైనా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు చంద్రబాబునాయుడు ప్రజలకు ఆపద్బాంధువుడుగా ఎనలేని సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. తుఫాన్ నేపథ్యంలో బాధితులను పునరావాస కేంద్రాలకు చేర్చి, వారికి అన్ని వసతులు కల్పించిన పలువురు అధికారులను ఆయన సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ అనిత, తహశీల్దార్ నాగరాజు, ఎంపీడీవో రమేష్‌నాయుడు,



మత్స్యకారులకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

సర్పంచ్‌లు చింతకాయల సుజాత, చేపల మసేను, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, ఎంపీటీసీ సభ్యురాలు అర్జిల్లి దేవి, జనసేన పరవాడ మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్, కూటమి నాయకులు మాసవరపు అప్పలనాయుడు, కన్నూరు వెంకటరమణ, బుగిడి రామగోవిందరావు, కరణం నరసింగరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ



కశింకోట మండలం కొత్తపల్లిలో వృద్ధురాలికి పింఛను అందిస్తున్న పీలా

అనకాపల్లి టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రం సంక్షోభంలో ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడుదేనని అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ ప్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. గవరపాలెం నిదానందొడ్డిలో జగదీశ్వరరావు, విజ యరామరాజుపేటలో పీలా గోవింద ఎన్టీఆర్ భరోసా పింఛన్లను శనివారం వేర్వేరు చోట్ల పంపిణీ చేసి మాట్లాడారు. అర్హులందరికీ పింఛన్లు అందిస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలో ఇల్లు లేని పేదలకు త్వరలోనే ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు.

కశింకోట మండలంలో...

కశింకోట : మండలంలోని కొత్తపల్లి, బుచ్చెయ్యపేట గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మాజీ ఎమ్మెల్యే పీల గోవింద పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గొంతిన శ్రీని వాసరావు, కశింకోట పీఏసీఎస్ చైర్మన్ సిదిరెడ్డి శ్రీను, టీడీపీ నాయకులు వేగి గోపీకృష్ణ, కాండ్రేగుల సతీష్, గంగయ్య, తిర్రి చిరంజీవి, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బయ్యవరంలో..

బయ్యవరంలో గ్రామంలో పింఛన్లనను ఎంపీడీవో చుక్కా చంద్రశేఖరరావు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె.రెహమాన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సిహెచ్. ప్రసాద్, మాణిక్యం, చోడే కన్నయ్య, కాశీరావు, బలిజ చంటి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నూతనగుంటపాలెంలో..

నూతనగుంటపాలెంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పింఛన్లను పంపిణీ చేశారు. అర్హులంతా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

తుమ్మపాల : దేశంలో అత్యధికంగా సామాజిక భరోసా పింఛన్లు ఇస్తున్నది కూటమి ప్రభుత్వమేనని టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి పేర్కొన్నారు.



గవరపాలెం నిదానందొడ్డిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న నాగజగదీశ్వరరావు



ఎన్‌జీపాలెంలో పింఛన్ నగదు అందిస్తున్న దాడి రత్నాకర్

శనివారం తుమ్మపాలలో మంజూరైన కొత్త పింఛన్‌లను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. అర్హులైన వారందరికీ పింఛన్లు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు గొంతిన శ్రీనివాసరావు, చిన్ని జగ్గారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం మండలంలో...

సామాజిక పింఛన్ల పంపిణీలో జిల్లాలోనే సబ్బ వరం మండలం మొదటి స్థానంలో నిలిచిందని ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. మండలంలోని నారపాడు, బలిజపాలెం, బాటజంగాలపాలెం, గాలిభీ మవరం గ్రామాల్లో శనివారం పలువురికి పింఛన్లు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మామిడి లక్ష్మి, సర్పంచ్ పడాల వెంక టరమణ, మామిడి కొండాజీ, రొంగలి శ్రీను, కొరుపోలు గోవింద తదితరులు పాల్గొన్నారు.

లంకెలపాలెంలో...

లంకెలపాలెం : అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పేర్కొన్నారు. లంకెలపాలెం, దేశపాత్రునిపాలెంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

పీలా వారి గౌరమ్మ గుడి వద్ద మహిళలకు వాయినాలు



వాయినాలు అందిస్తున్న రజని

అనకాపల్లి టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పీలావారి గౌరీపరమేశ్వరుల మహోత్సవంలో భాగంగా శనివారం గవరపాలెం వినాయక గౌరీ సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు వాయినాలను పంపిణీ చేశారు. కొణతాల రజని వీటిని ముత్తైదువులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమితి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరమ్మ సంబరాలు



ఆదిదంపతులను దర్శించుకుంటున్న భక్తులు

సబ్బవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గొటివాడ శివారు బొండావానిపాలెంలో చవితి గౌరమ్మ సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరీ పరమేశ్వరులకు విశేష పూజలు నిర్వహించారు. వైసీపీ నాయకులు గండి రవికుమార్, కర్రి బాబు, యడ్ల నాయుడు, ఉప సర్పంచ్ గొలజాన ప్రసాద్‌లతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు.

జాతీయ స్థాయి థాంగ్-థా పోటీల్లో దీపాంజలి నగర్ విద్యార్థి ప్రతిభ

పరవాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గోవాలో గత నెల 28 నుంచి మూడు రోజల పాటు నిర్వహించిన జాతీయ సబ్ జూనియర్, సీనియర్ థాంగ్- థా (కత్తి యుద్ధం) చాంపియన్‌షిప్ పోటీల్లో సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన దీపాంజలినగర్ విద్యార్థి కేకేఎస్ సాత్విక్ సత్తా చాటాడు. సబ్ జూనియర్స్ 41 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడని కోచ్ గొర్లి పుష్పారావు తెలిపారు. ఈ సందర్భంగా అతనిని శనివారం మాజీ ఎంపీపీ మాసవ రపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ కూం ద్రపు శ్రీను, కె.సింహాచలం, కె.ఝాన్సీరాణి, ఎం.తులసీరావు తదితరులు అభినందించారు.

ఈ-చలానాలపై అవగాహన



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

అనకాపల్లి టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఈ- చలానాలపై ద్విచక్ర వాహనచోదకులకు ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ శనివారం ఇక్కడ అవగాహన కల్పించారు. వాహనచోదకులు పాటించాల్సిన ట్రాఫిక్ నిబంధనలు, వాటిని అతిక్రమిస్తే విధించే జరిమానాల గురించి వివరించారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినప్పుడు వేసే జరిమానాలను ఈ- చలానాల పేరుతో ఏ విధంగా పే చేయాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

భారీ లోడు లారీకి రూ.48 వేలు జరిమానా

అనకాపల్లి టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జలగలమదుం జంక్షన్ వద్ద భారీ రాయి లోడుతో వెళ్తున్న లారీని శనివారం ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ అదుపులోకి తీసుకున్నారు. సబ్బవరం రోడ్డులోంచి జాతీయ రహదారి మీదుగా వెళ్లేందుకు లారీ జలగలమదుం జంక్షన్ వద్దకు రాగానే ఆపారు. అనంతరం అదుపులోకి తీసుకొని రవాణాశాఖ అధికారులకు అప్పగించారు. దీంతో సదరు అధికారులు అధిక రాయి లోడుతో వెళ్తున్న లారీకి రూ.48వేలు జరిమానా విధించారని సీఐ వెంకటనారాయణ తెలిపారు.

ఎనిమిది మద్యం బాటిళ్లతో మహిళ అరెస్టు

కొత్తూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కుంచంగిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను అదుపులోకి తీసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ లక్ష్మన్నాయుడు తెలిపారు. గడుతూరి చిన్నతల్లి అనే మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు శనివారం దాడి చేశామన్నారు. ఆమె నుంచి ఎనిమిది క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు చెప్పారు.

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం

అనకాపల్లి టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలకు నివాళులర్పించారు. సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డులోని కన్యకాపరమేశ్వరీ ఆలయ జంక్షన్ వద్ద శ్రీరాములు విగ్రహానికి ఆర్టీసీ డీఎం హనుమశ్రీ పూలమాల వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం, వినకోట నీలేష్ గుప్తా, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



జోరుగా సామాజిక పింఛన్ల పంపిణీ

93 శాతం ఇంటింటికీ వెళ్లి అందించిన ఉద్యోగులు


మాడుగులలో పింఛన్లు అందిస్తున్న ఉద్యోగులు, నాయకులు

మాడుగుల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల కార్యక్రమం శనివారం జోరుగా.. హుసారుగా సాగింది. అధికారులు, ఉద్యోగులు, నాయకులు ఇంటింటికీ వెళ్లి నేరుగా లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. మాడుగుల మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో తెల్లవారు ఆరు గంటల నుంచే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో కొంకి అప్పారావు మాట్లాడుతూ మండలంలో 11,435 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా, శనివారం సచివాలయ ఉద్యోగులు 93 శాతం వరకు పంపిణీ చేశారని చెప్పారు. మాడుగులలో లబ్ధిదారులకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనారాయణ పెన్షన్ అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు త్వరలో పెన్షన్ అందించేందుకు ఆన్‌లైన్‌లో అర్జీల సేకరణ ఉంటుందని చెప్పారు. ఎవరికి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కార మార్గం చూపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ కార్యదర్శి వడ్డాది బాబు, బూత్ ఇన్‌చార్జి కొట్టేడ మల్లికార్జునుడు, మహిళా పోలీసు రమా తదితరులు పాల్గొన్నారు.

చీడికాడలో 95 శాతం పంపిణీ

చీడికాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో 95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీవో హేమసుందరరావు తెలిపారు. మండల వ్యాప్తంగా 8493 మంది లబ్ధిదారులు ఉండగా, శనివారం 8034 మందికి పింఛన్లు అందించామని చెప్పారు. మిగిలిన వారికి సోమవారం పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. తురువోలు గ్రామంలో ఎంపీటీసీ సభ్యుడు బి.కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ పీటీ బాబు, టీడీపీ జిల్లా నేత రెడ్డి సన్యాసినాయుడు చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేశారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

కె.కోటపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని నన్నయ్య యూనివర్సిటీ రిటైర్డ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ముర్రు ముత్యాలనాయుడు సూచించారు. మండలంలోని జోగన్నపాలెం, కింతాడ గ్రామాల్లో అయ్యన్న జూనియర్, డిగ్రీ కళాశాలల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాలు నిర్వహించడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాసీం, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కశిరెడ్డి అప్పలనాయుడు, ఎన్ఎస్ఎస్ పీవోలు గాడి అప్పారావు, ఎస్.రమణ, సర్పంచ్ బి.ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

దేవరాపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపడుతున్నామని, దీనికి అందరూ సహకరించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పేర్కొన్నారు. మండలంలోని ఎ.కొత్తపల్లిలో శనివారం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయడానికి యోచిస్తున్నదని చెప్పారు. దీన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించి అడ్డుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం వైసీపీ మండల అధ్యక్షుడు బాబూరావు, సర్పంచ్ చింతల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి జన్మదిన వేడుకలకు పీవీజీకి ఆహ్వానం

కె.కోటపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో ఈ నెల 23న జరగనున్న భగవాన్ సత్యసాయిబాబా శతవర్ష జన్మదిన వేడుకలకు రావాలని రాష్ట్ర వెలమ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్‌కు సేవా సంస్థల అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం పీవీజీ కుమార్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.
































తుఫాన్ బాధితులకు అన్ని విధాలా సాయం

▸▸ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

కె.కోటపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితులకు అన్ని విధాలుగా సాయం అందిస్తామని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. మండలంలోని ఆర్లే గ్రామంలో శనివారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థుల నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనుభవం ఫలితంగానే వరద నష్టం పెరగకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. బాధితులను సకాలంలో ఆదుకున్నది ఒక్క తెలుగుదేశం ప్రభుత్వం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. మాడుగుల నియోజకవర్గంలో 380 మంది బాధిత కుటుంబాలను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా సాయం చేస్తున్నదన్నారు. జిల్లా వ్యాప్తంగా పంట పొలాలు ముంపునకు గురయ్యాయన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలను రైతులు పాటించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, డైరెక్టర్ రొంగలి మహేశ్, టీడీపీ నాయకులు సబ్బవరపు రామునాయుడు, బోలెం బుల్లిదొర, కన్నూరు సూర్యనారా యణ, జూరెడ్డి రాము, బండారు ప్రసాద్, కశిరెడ్డి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు

▸▸ భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



తిమిరాం ఉమామహేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల/మాడుగుల రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో శనివారం ఏకాదశి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీంతో పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మాడుగుల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు శివాలయాలు, వేంకటేశ్వరస్వామి ఆలయాలకు తరలివెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే మరి కొంతమంది భక్తులు కార్తీక ఏకాదశి ఉపవాస దీక్షలు కొనసాగించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లను చేశారు. కేజే పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తుల వచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రాపేటి రామకొండారావు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు.

తిమిరాం శివాలయంలో...

దేవరాపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమిరాం శివాలయంలో శనివారం ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి భక్తులు అభిషేకాలు చేయించుకున్నారు. పెదనందిపల్లి, చిననందిపల్లి, బి.కింతాడ, తెనుగుపూడి, దేవరాపల్లి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నాగయ్యపేట అయ్యప్ప స్వాముల పీఠం శుక్రవారం రాత్రి అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. విజయనగరం జిల్లా వేపాడ మండలం, దేవరాపల్లి మండలంలోని అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పురోహితులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. విశాఖపట్నానికి చెందిన మారుతి భక్తిరంజని సభ్యుల అయ్యప్ప భక్తి గీతాలు, ఓం భారత్ శక్తి పీఠం భారతానంద మహరాజ్ ప్రవచనాలు అలరించాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బి.కింతాడ సబ్ స్టేషన్ పరిధిలో ములకలాపల్లి, కొత్తపెంట గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఏఈఈ కర్రి శంకరరావు తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. లైన్ల మరమ్మతు పనుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కె.కోటపాడు: మండల కేంద్రంలో నూకాంబిక ఆలయ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. మంచినీటి కోనేరు వద్ద గ్రామానికి చెందిన ఎగువవీధి శెట్టి బలిజ కులస్థులు ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. వేద పండితులు భూమి పూజ చేశారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు గౌతమ్ ఎంపిక


మెడల్‌తో గౌతమ్

అనంతగిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువశోభ పంచాయతీ కొత్తవలస కు చెందిన పాంగి గౌతమ్ అండర్-17 విభాగంలోని రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడు. అరకువేలి దండ కారుణ్య జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గౌతమ్ శనివారం అనకాపల్లిలో జరిగిన విశాఖ ఉమ్మడి జిల్లా అండర్-17 బ్యాడ్మింటన్ పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపల్ శ్రీను తెలిపారు. కోచ్ రాజాబాబు, తోటి విద్యార్థులు గౌతమ్‌ను అభినందించారు.

పూలుగుడలో దంత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య నిపుణులు

డుంబ్రిగుడ, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలుగుడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం హెచ్ఎం ఎం శ్రీనివాసరావు, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు ఆధ్వర్యంలో దంత వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖనుంచి వచ్చిన దంత వైద్య నిపుణులు ఎం. దీప్తి, చంద్రిక, అనుప్రియ, ప్రతిమ, విద్యావతి 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసర మందులందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు సుందర రావు, గెన్ను, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, ఉపాధ్యాయులు రమేశ్, రాం ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

పసికందుకు పాల డబ్బాలు పంపిణీ

డుంబ్రిగుడ, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): తల్లి మృతితో పాలకు నోచుకోని 24 నెలల పసికందుకు యూనిటీ ఫర్ చారిటీ సంస్థ ప్రతినిధులు శనివారం పాల డబ్బాలను పంపిణీ చేసి సేవా భావాన్ని చాటుకున్నారు. మండలంలోని సోవ్వ పంచాయతీ పరిధి కరకవలసలో శిశువుకు అవసరమైన పాలడబ్బాలను తాంగుల మోదో అనే గిరిజనుడికి అందజేశారు. పసికందు ఎదిగేంతవరకు పాల డబ్బాలు అందిస్తామని సంస్థ ప్రతినిధులు నీలి ఆదిత్య తెలిపారు. ప్రతినిధులు నారాయణ, జోష్ పిన్ పాల్గొన్నారు.

బిర్సాముండా సేవలు చిరస్మరణీయం


అల్లూరి, బిర్సా ముండాకు నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్, ఉపాధ్యాయులు

చింతపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా సేవలు చిరస్మరణీయమని స్థానిక ఏకలవ్య ఆదర్శ నివాసానుబంధ పాఠశాల(ఈఎంఆర్ఎస్) ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్ అన్నారు. శనివారం పాఠశాలలో బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయులు జన్ జాతీయ దివాస్‌ను ప్రారంభించారు. తొలుత అల్లూరి సీతారామరాజు, బిర్సా ముండా చిత్రపటాలకు పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఏటా జాతీయ స్థాయిలో నవంబరు ఒకటి నుంచి 15తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్


ప్రతిజ్ఞ చేయిస్తున్న జెన్‌కో అధికారులు

సీలేరు, నవంబర్1 (ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్‌కో విద్యుత్ సంస్థ విజిలెన్స్ అవేర్‌నెస్ ప్రోగామ్ అక్టోబర్ 21 నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్నట్టు ఏపీజెన్‌కో సెక్యూరిటీ హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వరరావు తెలిపారు. సీలేరు జలవిద్యుత్‌కేంద్రంలో సెక్యూరిటీ విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జెన్‌కో ఎస్‌ఈ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి ఈఈ రాజేంద్రప్రసాద్, పాల్గొన్నారు. విధి నిర్వహణలో ఉన్న ప్రతీ ఒక్కరూ అవినీతికి ఆస్కారం లేకుండా బాధ్యతాయుతంగా మెలగాలనిఉద్యోగులతో ప్రతిజ్ఞ చేశారు. ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో నడుస్తున్న డీఏవీ పాఠశాలలో విజిలెన్స్ అవేర్‌నెస్ పై వ్యాసరచనపోటీలను నిర్వహించి బహుమతులు అం దజేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ సివిల్ ఇన్ చార్జి జైపాల్, డీఏవీ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ జెన్‌కో సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం

చింతపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయబారతి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ బి. రమణ, జగదీశ్ బాబు, నాగేశ్వరరావు, సతీశ్,విద్యార్థులు పాల్గొన్నారు.

సీలేరులో పారిశుధ్య పనులు

సీలేరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీలేరు మేజర్ పంచాయతీలో పారిశుధ్య పనులు సాగుతున్నాయి. పంచాయతీ కార్యదర్శి వంతాల పరశురామ్, సర్పంచ్ పాంగి దుర్గో ఆధ్వర్యంలో సీలేరు మార్కెట్ నుంచి రామాలయం మీ దుగా వెళ్లే డ్రైనేజీ చెత్తా చెదారంతో నిండిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు గృహాలలోకి నీరుచేరిస్థానికులు ఇబ్బంది ఎ దుర్కొన్నారు. దీంతో డ్రైనేజీలలో పూడికలు, చెత్తా చెదారం తొలగించామనికార్యదర్శి పరశురామ్ తెలిపారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

» జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

పాడేరురూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి, రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. పాడేరు పంచాయతీ సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి ఆధ్వర్యంలో శనివారం ముల్లుమెట్టలో చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాలను సమతుల్యంగా అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యురాలు జి.ఉషారాణి, టీడీపీ నాయకులు రమేష్‌నాయుడు, రొబ్బి రాము, పి.పాండురంగస్వామి, ఈవో పీఆర్ అండ్ ఆర్‌డి ఆర్‌వీఎస్.రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ ఘనత కూటమిదే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకటో తేదీకే పింఛన్లను పంపిణీ చేస్తోందని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకట సురేష్ కుమార్ అన్నారు. ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ. 4 వేలు, వికలాంగులకు రూ. 6 వేలు, సికిల్ సెల్ బాధితులకు రూ. 10 వేలు, పక్షవాత బాధితులకు రూ. 15 వేలు చొప్పున అందిస్తున్నారన్నారు. శనివారం ఆయన గుత్తులపుట్టు, గబ్బంగి, నేరేడివలస, కొత్తాబు, దేవాపురం గ్రామాల్లో పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు టి.వెంకట ప్రసాద్, బి.రాధాకృష్ణ, చిట్టిబాబు, సచివాలయ సిబ్బంది కృష్ణకుమారి,శిరోమణి, రోజారమణి పాల్గొన్నారు. ఐటీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బుద్ద జ్యోతికిరణ్ 13వ వార్డులో లబ్ధిదారులకు పింఛన్‌లు పంపిణీ చేశారు.నాయకులు కె.రాజేష్, లక్ష్మణరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని కితలంగి పంచాయతీ కొంతుగుడ గ్రామంలో శనివారం అరకు పార్లమెంట్ కోశాధికారి వంత నాగేశ్వరరావు అధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు అదుకోవడం కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు పింఛన్లను అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోత్తి, ఎంపీటీసీ మాజీ సభ్యులు అర్జున్, యువనాయకుడు రాంబాబు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ముల్లుమెట్టలో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న జీసీసీ చైర్మన్ కిడారి తదితరులు

96 శాతం పింఛన్ల పంపిణీ

అనంతగిరి: మండలంలోని 21 సచివాలయాల పరిధిలోని వృద్ధాప్య, దివ్యాంగులు, వితంతువు తదితర 5881 పింఛన్లకు గాను 5602 మందికి పంపిణీ చేశారు. శనివారం ఉదయం గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి పింఛన్లను 96 శాతం వరకు పింఛన్లను సచివాలయ ఉద్యోగులు అందించినట్టు స్థానిక ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. మండలంలోని జీనబాడు పంచాయతీలోని జీనబాడు, పెద గంగవరం, దిబ్బపాలెం, దాయర్తి గ్రామాల్లో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సురేశ్ ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ చేశారు. మం డల కేంద్రంలో టీడీపీ నేత మోస్య రంజిత్, వైస్ సర్పంచ్ అర్జున్ ఆధ్వర్యంలో అందించారు.

అర్హులందరికీ పింఛన్లు: టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

చింతపల్లి: గిరిజన ప్రాంతంలో అర్హులందరికి కూటమి ప్రభుత్వం పింఛన్ అందజేస్తుందని టీడీపీ పాడేరు నియోజక వర్గం ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. శనివారం మండలంలోని రాజుపాకలు గ్రామంలో స్థానిక ఏఎంసీ చైర్‌పర్సన్ కిల్లో ఊర్మిళతో కలిసి టీడీపీ నియోజక వర్గం ఇన్‌చార్జి లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా టీడీపీ పాడేరు నియోజక వర్గం ఇన్‌చార్జి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ ముఖ్యమంత్రి పింఛన్ పెంపొందించారన్నారు. ప్రస్తుతం భర్త చనిపోయిన మహిళలకు వెను వెంటనే స్పౌజ్ పింఛన్లు అందజేస్తున్నారన్నారు. గ్రామ సచివాలయం ఉద్యోగులు లబ్ధిదారుల గృహాల వద్దకు వచ్చి పింఛన్ అందజేస్తున్నారన్నారు. తొలిరోజే చింతపల్లి మండలంలో 96శాతం పింఛన్ పంపిణీ జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి, కార్యదర్శి లక్ష్మి కుమార్ పాల్గొన్నారు.


రాజులపాకలో పింఛన్ అందజేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

కల్యాణ వైభోగమే..

» శ్రీనివాస కల్యాణోత్సవం

» గోవింద నామస్మరణతో మార్మోగిన గొందిపాకలు

చింతపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొందిపాకలు గ్రామ పంచాయతీ నూకాలమ్మ ఆలయం మైదానంలో శ్రీనివాస కల్యాణోత్సవం అంగరంగా వైభవంగా జరిగింది. శనివారం తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు, వేదపండితుల ఆధ్వర్యంలో ఈ వేడు నిర్వహించారు. తొలుత గ్రామంలోని రామాలయం నుంచి నూకాల మ్మ ఆలయం వరకు కిలోమీటరు మేర భారీ శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు కోలాటం, థింసా నృత్యాలతో ముందుకు సాగింది. శ్రీవారి రథం గ్రామ పురవీధుల మీదుగా నూకలమ్మ ఆలయ కల్యాణ వేదిక వద్దకు వస్తుండగా ఇళ్లనుంచి ఆదివాసీ భక్తులు వచ్చి పసుపు, కుంకుమ నీళ్లను సమర్పించి స్వాగతం పలికారు. కల్యాణం ప్రారంభానికి ముందు హరికథ, సంగీత కార్యక్రమాలతో రంజింపజేశారు. అనంతరం సాయి స్వామి అర్చక బృందం శ్రీనివాస కల్యాణోత్సవం ప్రారంభించింది. వేదికపై పాడేరు టీడీపీ నియోజక వర్గం ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి, స్థానిక సర్పంచ్ సాగిన వరలక్ష్మి ఆశీనులయ్యారు. అర్చక బృందం వేదమంత్రాల సాక్షిగా కన్నుల పండువగా కల్యాణాన్ని జరిపించారు. తరువాత భక్తులు, వేదపండితులు గోవింద నామస్మరణతో భక్తిభావాన్ని చాటారు. ఈ వేడుక స్వయంగా వీక్షించేందుకు సుమారు మూడువేల మంది భక్తులు హాజరయ్యారు. భక్తులందరికి టీటీడీ అధికారులు శ్రీవారి లడ్డూ, పద్మావతి అమ్మవారి కుంకుమ, పుస్తకప్రసాదం, కంకణం, చక్రపొంగలి, కట్టుపొంగలి పంపిణీ చేశారు. స్థానిక నిర్వాహక కమిటీ భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సూపరింటెండెంట్లు హరిబాబు, చెంగలరాయుడు, స్థానిక సీఐ ఎం. వినోద్‌బాబు, ఎస్ఐ వి. వెంకటేశ్వరరావు, ఎంపీపీ కోరాబు అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ కిల్లో ఊర్మిళ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గెమ్మెలి అబ్బాయినాయుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ రొబ్బ హశ్వంత్, టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, నేత రీమల ఆనందరావు, ఏఎంసీ డైరెక్టర్ పెదిరెడ్ల బేతాళుడు, నిర్వాహక కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, లింగమూర్తి, వెంకట గిరి, బొడు గంగరాజు పాల్గొన్నారు.


స్వామివారి హారతి తీసుకుంటున్న టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి


గోవింద నామస్మరణలో భక్తులు

పక్కాగా పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు : డీఈవో


పాఠశాలలో సౌకర్యాలను పరిశీలిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు, అసిస్టెంట్ విద్యాకమిషనర్

పాడేరురూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు చర్యలను చేపడుతున్నట్టు డీఈవో పాటోజు బ్రహ్మాజీరావు, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ (ప్రభుత్వ పరీక్షలు) ఆర్.శశికుమార్ తెలిపారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పదో తరగతి పరీక్షల నిర్వహణలో ముందస్తు చర్యల్లో భాగంగా శనివారం పాడేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సెయింటాన్స్ స్కూల్‌ను సందర్శించామన్నారు. ఆయా పాఠశాలల్లో పరీక్ష కేంద్రాల కాంపౌండ్ వాల్, బెంచీలు, ఫర్నీచర్, లైట్స్, ఫ్యాన్స్, టాయిలెట్స్, తాగునీటి తదితర సౌకర్యాలను పరిశీలించినట్టు చెప్పారు. సౌకర్యాల మెరుగుపర్చే విధంగా హెచ్‌ఎంలకు సూచనలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు మోరి జాన్, సీహెచ్.సరస్వతీదేవి, హెచ్‌ఎం.ఎస్.విశ్వప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా నృత్యోత్సవాలు ప్రారంభం


నృత్యోత్సవ విజేతలతో నిర్వాహకులు

పాడేరురూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గిరి శీతల సాంస్కృతిక నృత్యోత్సవాలు- 2025లో భాగంగా పట్టణంలోని శ్రీమోద అవార్డ్స్ జాతీయ స్థాయి టాలెంట్ సెర్చ్ కార్యక్రమాన్ని శనివారం మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి సాంస్కృతిక నృత్యోత్సవాలు గిరిజన ప్రాంతంలో జరగడం ఇదే ప్రథమమని ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి అనేక మంది నాట్యకళాకారులు వచ్చి ప్రదర్శనను స్థానికుల్లో స్ఫూర్తి నింపుతుందన్నారు. నృత్యాంజలి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ గురువు చైతన్య ప్రభు, గిరి కైలాస క్షేత్ర ధర్మకర్త మండలి సభ్యులు కొట్టగుళ్లి రమాదేవి, ఆర్గనైజర్ కె.సత్యవతి, రూపి నిర్మల, వెంకటరావు, కూచిపూడి శిక్షణాలయం కాకినాడ బృందం, వెంకటరాయ నృత్యాలయం రాజమహేంద్రవరం యశోద కృష్ణ బృందం పాల్గొన్నారు.

అర్హులందరికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు

» ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ దొన్నుదొర


ముంచంగిపుట్టులో పెన్షన్లు అందిస్తున్న దొన్నుదొర

ముంచంగిపుట్టు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అం దిస్తున్నట్టు విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ సియ్యారి దొన్నుదొర అన్నారు. మండలంలోని కించాయిపుట్టు, కిలగాడ వనభసింగి, ఏను గురాయి తదితర పంచాయతీల పరిధి పలు గ్రామాల్లో శనివారం నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా లబ్ధిదారులకు ప్రతీ నెలా ఒకటో తేదీన పెన్షన్ సొమ్మును అందిస్తున్నట్టు చెప్పారు. అలాగే, యువతకు ఉపాధి కల్పించాలని విద్యాశాఖ మంత్రి లోకేశ్ పరిశ్రమలను రాష్ట్రానికితీసుకువచ్చేందుకు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. అందులో భాగంగానే విశాఖకు ఇటీవల గూగుల్ తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు వి.లక్ష్మణ్, కె.శివశంకర్, పీఏసీఎస్ మండల చైర్మన్ ఎస్.బాబూజీ, టీడీపీమండల అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ, ప్రధాన కార్యదర్శి కె.జగత్రాయ్,రాష్ట్ర ఎస్టీసెల్ ఆర్గనైజేషన్ సెక్రటరీలు గడ్డంగి రామ్మూర్తి, ఎ. తిరుపతి రావు, నేతలు కె.బలరాం, వి.రామస్వామి, ఎం.చిన్నిబాబు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు రేషన్

జి.మాడుగుల: మొంథా తుఫాన్ బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేసినట్లు సర్పంచ్ కిముడు రాంబాబు తెలిపారు. జి.మాడుగుల, గాంధీనగర్, తీగలమెట్ట, ఉరుము గ్రామాల్లో బాధితులకు సరకులు అందించినట్టు చెప్పారు. మాజీ ఎంపీపీ ఎం.వెంకటగంగరాజు, మాజీ సర్పంచ్ రమణ, రామారాజు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మలేరియా కేసులపై అప్రమత్తం

» జోనల్ మలేరియా అధికారిణి డాక్టర్ ప్రభావతి


కేజీబీవీ పాఠశాలలోని విద్యార్థినితో మాట్లాడుతున్న ప్రభావతి, ఎంపీహెచ్‌వో

అనంత గిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మలేరియా కేసులు నమోదైన వెంటనే వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉంటూ వైద్యసేవలను అందించాలని జోనల్ మలేరియా అధికారిణి డాక్టర్ బి.ప్రభావతి అన్నారు. మండలంలోని కాశీపట్నం, కొత్తూరు కేజీబీవీ పాఠశాలను శనివారం ఆమె సందర్శించారు. కొత్తూరు కేజీబీవీకి చెందిన ఇద్దరు విద్యార్థినులకు మలేరియా పాటిజివ్ రావడంతో వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిక్ రూమ్‌ను పరిశీలించి, దోమ తెరలను వాడాలని, కిటికీల నుంచి దోమలు రాకుండా చర్యలు చేపట్టాలని ప్రిన్సిపాల్ సుశీలకు సూచించారు. నీటినిల్వలు లేకుండా చూడాలన్నారు. దోమలను నివారించగలిగితే మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా జ్వరాలను తగ్గించవచ్చునని చెప్పారు. మలేరియా కేసులు నమోదైన వెంటనే సిబ్బంది ప్రత్యేక వైద్యసేవలను అందించాలని వైద్యాధికారిణి జ్ఞానేశ్వరికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలోని జోనల్ కార్యాలయం ఎంపీహెచ్‌వో బి.తిరుపతిరావు, సబ్‌యూనిట్ అధికారి బాబూరావు, ఎంపీహెచ్‌ఈవో సింహాచలం, పాల్గొన్నారు.

చంద్రబాబుకు జీవితాంతం రుణ పడి ఉంటాం

» మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత సివేరి సోమ కుటుంబ సభ్యులు

» కుమారుడికి డిటీ పోస్టింగ్‌పై హర్షం


ముఖ్యమంత్రిమంత్రి చంద్రబాబునాముడు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సోమ కుటుంబ సభ్యులు

అరకులోయ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల దాడిలో మృతిచెందిన దివంగత మాజీ ఎమ్మెల్యే సీవేరి సోమ కుటుంబానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హమీలునిలుపుకోవడంపై ఆ కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తంచేశారు. ఎనిమిదేళ్ల కిందట నక్సల్స్ దాడిలో కిడారి సర్వేశ్వరరావు, సీవేరి సోమ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సమయంలో సోమ కుటుంబానికి పది సెంట్ల భూమి, ఉద్యోగం ఇస్తామని టీడీపీ ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే, అనంతరం రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. సీవేరి కుటుంబం పలుమార్లు తమకు న్యాయం చేయాలని కోరినా ఆ ప్రభుత్వం స్పందించలేదని మాజీ ఎస్టీకమిషన్ సభ్యుడు, సోమ కుమారుడు సీవేరి అబ్రహం అన్నారు. మళ్లీ కూటమి అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తమ సమస్యలు తీసుకువెళ్లామన్నారు. దీంతో సీఎం తన సోదరుడు సీవేరి సురేశ్‌కుమార్‌కు డిప్యూటీ తహశీల్దార్ పోస్టునకు ఎంపిక చేస్తూ జీవో ఇ వ్వడంపై అబ్రహంతోపాటు డీటీగా పోస్టింగ్ పొందిన సురేశ్, సోమ సతీమణి ఇచ్చావతి సంతోషం వ్యక్తంచేశారు. అలాగే, పార్టీ నేతలు, కార్యకర్తలు, సో మ అభిమానులు పెద్ద ఎత్తున స్థానిక అబ్రహం గృహానికి శనివారం చేరుకొని ముఖ్యమంత్రిచంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసి అభిమానాన్ని చాటుకున్నారు. ఈసందర్భంగా డీటీగా పోస్టింగ్ పొందిన సురేశ్, మాట్లాడుతూ పార్టీ తమను వదిలేసిందని, అధినేత నుంచి ఇక ఎటువంటి సాయం అందదని పలువురు హేళన చేశారన్నారు. వారికి జవాబుగా హామీలను నేరవేర్చి సీఎం చంద్రబాబు అండగా నిలిచారన్నారు. ఆయన రుణం తీర్చుకోలేమని సోమ కుటుంబ సభ్యులు అన్నారు.


థ్యాంక్యూ సీఎం ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న టీడీపీ శ్రేణులు

లండుల పాఠశాలలో ఉపాధ్యాయిని విధులకు డుమ్మా

» విద్యార్థుల తల్లిదండ్రులు, జీఎస్‌యూ నాయకుల ఆందోళన


ఆందోళన వ్యక్తంచేస్తున్న గ్రామస్థులు, జీఎస్‌యూ నేతలు

పెదబయలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విధులకు డుమ్మా కొడుతున్న మండలంలోని గిన్నెలకోట పంచాయతీ లండులు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల చర్యలు తీసుకోవాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. శనివారం పాఠశాల ఎదుట ఈ మేరకు ఆందోళన చేశారు. గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో సుమారు 30 మంది విద్యార్థులు చదువుతున్నట్టు తెలిపారు. అక్టోబరు నెల 13వ తేదీన నూతన ఉపాధ్యాయురాలు వచ్చి గ్రామస్థులతో పరిచయం చేసుకుని వెళ్లారని, అప్పటినుంచి నేటి వరకు రాలేదని ఆరోపించారు. దీంతో విద్యార్థులకు బోధన దూరమై వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు. గిన్నెగరువు పాఠశాలలో కూడా ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు హాజరుకావటం లేదని జీఎస్‌యూ నాయకులు ఆరోపించారు.వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విచారణ చేపతాం: ఎంఈవో

ఈ విషయంపై ఎంఈవో- 2 పుష్పజోసెఫ్ వద్ద ప్రస్తావించగా, లండులు ఎంపీపీఎస్ ఉపాధ్యాయురాలు గైర్హాజరుపై తమకు సమాచారం లేదన్నారు. దీనిపై తక్షణమే విచారణ చేపట్టి ఉపాధ్యాయురాలిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌యూ నాయకులు మాధవరావు, బాబూజీ, రాంబాబు, మూర్తి, రాజుబాబు, చంటిబాబు, శైలజ, శ్రీనివాస్,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడి పూజ


ఊరేగింపులో పాల్గొన్న మాలదారులు

పాడేరురూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పాడేరు పట్టణంలోని పూర్ణపుషలాంబ సమేత అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో బూరెడ్డి చిట్టిబాబు, బిందు దంపతులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప మాలధారుల పడి పూజా మహోత్సవం శనివారం వైభంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు, ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ముందుగా అయ్యప్పస్వాములు ఉప సర్పంచ్ బూరెడ్డి రామునాయుడు ఇంటి నుంచి అయ్యప్పస్వామి ఆలయానికి భారీ ఊరేగింపును చేపట్టారు. ఈ కార్యక్రమంలో బూరెడ్డి నాగేశ్వరరావు, కొండబాబు, భవాని, సందీప్, చిట్టిబాబు కుటుంబ సభ్యులు సహకారం అందించారు. పాడేరు డివిజన్ పరిధిలోని 11 మండలాలకు చెందిన మాలధారులు గురుస్వాములు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన గిరిజన కార్నివాల్


పచ్చజెండా ఊపి కార్నివాల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

సాగర్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన స్వాభిమాన్ పక్షోత్సవాల కార్నివాల్‌ను రుషికొండ బీచ్‌లో శనివారం గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ ఎస్.భార్గవితో కలసి కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. కార్నివాల్ రుషికొండ టీసీఆర్‌టీఎమ్ భవనం వరకు సాగింది. అక్కడ జ్యోతిప్రజ్వలన చేసిన కలెక్టర్ గిరిజన స్వాతంత్ర్య పోరాట యోధుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. సమరయోధుల సహకారం, త్యాగాలను స్మరించుకుంటూ జన్‌జాతీయ గౌరవ్ వర్ష్ పేరుతో కేంద్రప్రభుత్వం నిర్వహిస్తున్న భగవాన్‌బిర్సాముండా జయంత్యుత్సవాల్లోభాగంగా గిరిజన సంక్షేమ శాఖ, గిరిజన సాంస్కృతిక, పరిశోధన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కార్నివాల్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు 15 రోజులు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గిరిజన ఉత్పత్తులతో సంత ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా గిరిజన మ్యూజియం ప్రాంగణంలో మొక్కలు నాటారు. టీసీఆర్‌టీఎమ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మందారాణి, ఏకలవ్య స్కూల్స్ విద్యార్థులు, టీచర్లు, టీసీఆర్‌టీఎమ్ సిబ్బంది పాల్గొన్నారు.



కోటవీధిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

అర్హులందరికీ పింఛన్లు అందిస్తాం

▸▸ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తామని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. మండల కేంద్రంలోని కోటవీధితో పాటు పలు వార్డులలో శనివారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులకు త్వరలోనూ కొత్త పింఛన్లు మంజూరవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, పంచాయతీ ఈవో శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ పెదబాబు, టీడీపీ నాయకులు చిన్న, ఎస్.కోటేశ్వరరావు, దేవరపల్లి వెంకట అప్పారావు, కొట్టాపు రూపాదేవి, సర్పంచ్ నూకరత్నం, నేమాల హరి పాల్గొన్నారు.

నర్సీపట్నంలో...



పింఛన్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ చింతకాయల పద్మావతి

నర్సీపట్నం/అర్బన్, నవంబరు 1 (ఆంధ్ర జ్యోతి): మునిసిపాటీలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి గచ్చపువీధిలో శనివారం ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల పింఛను సొమ్ము అందజేశారు. కార్యక్రమంలో 28వ వార్డు కౌన్సిలర్ డబ్బీరు శ్రీకాంత్, టీడీపీ నాయకులు కొరుప్రోలు శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అన్ని పంచాయతీల్లో పింఛన్లను పంపిణీ చేశారు. ధర్మసాగరంలో జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు సుకల అప్పలనాయుడు ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లు కన్నా సచివాలయ ఉద్యోగులే అంకితభావంతో పనిచేస్తూ తెల్లవారకముందే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్నారన్నారు.

రోలుగుంటలో...

రోలుగుంట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూతనంగా తొమ్మిది స్పౌజ్ పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు. రోలుగుంటలో ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ పింఛన్లను పంపిణీ చేశారు. 24 పంచాయతీల్లో 8906 పింఛన్లు ఉన్నాయని, వారిలో తొలి రోజు 90 శాతం ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశామని ఈ సందర్భంగా ఎంపీడీవో తెలిపారు. భర్త చనిపోయిన మరుసటి నెలలోనే భార్యకు పింఛను మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మాడుగులలో...

మాడుగుల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాడుగుల మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో తెల్లవారు ఆరు గంటల నుంచే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో కొంకి అప్పారావు మాట్లాడుతూ మండలంలో 11,435 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా, శనివారం సచివాలయ ఉద్యోగులు 93 శాతం వరకు పంపిణీ చేశారని చెప్పారు. మాడుగులలో లబ్ధిదారులకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనారాయణ పెన్షన్ అందించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ కార్యదర్శి వడ్డాది బాబు, బూత్ ఇన్‌చార్జి కొట్టేడ మల్లికార్జునుడు, తదితరులు పాల్గొన్నారు.

ఏఎల్ పురంలో పాఠశాల భవన నిర్మాణం

▸▸ సమగ్ర శిక్షాభియాన్ డీఈఈ సుబ్బలక్ష్మి



హైస్కూల్‌లో భవన నిర్మాణానికి మార్కింగ్ ఇస్తున్న డీఈఈ

కృష్ణాదేవిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని ఏఎల్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణానికి ఇంజనీరింగ్ అధికారులు శనివారం మార్కింగ్ పనులు చేపట్టారు. సమగ్ర శిక్షాభియాన్ నిధులు రూ.23.1 లక్షలతో హైస్కూల్‌లో సైన్స్ ల్యాబ్ భవనానికి డీఈఈ సుబ్బలక్ష్మి, ఏఈ సత్యనారాయణ శనివారం మార్కింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో డీఈఈ మాట్లాడుతూ కృష్ణాదేవిపేట పోలీస్‌స్టేషన్ ఎదుట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ అనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలో బాలికల వసతి గృహం ఇర్మాణానికి ప్రభుత్వం సుమారు రూ.2 కోట్లు మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ నిధులతో నవంబరు నెలాఖరులోగా నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఆమె తెలిపారు. అలాగే హైస్కూల్ భవన నిర్మాణం త్వరతగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ ఎంఈవో-2 కృష్ణప్రసాద్, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ లగుడు రాజులునాయుడు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెంకుటిల్లు కూలి ఇద్దరికి గాయాలు



గాయపడిన మహిళను వివరాలు అడుగుతున్న ఆర్ఐ శ్రవణ్, నాయకులు

బుచ్చెయ్యపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు వడ్డాది కొత్తూరులో పెంకుటిల్లు కూలడంతో ఇద్దరికి గాయాల య్యాయి. నాలుగు రోజుల పాటు కురిసిన వర్షాలకు గోడలు నానిపోయి శుక్రవారం రాత్రి ఇల్లు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న వర్రి దేముడుబాబు, సత్యవతిలకు గాయాలయ్యాయి. సత్యవతికి తల, చేయిపై బలమైన గాయాలయ్యాయి. శనివారం ఆర్ఐ శ్రవణ్ కుమార్, వీఆర్వో పావని, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దొండా నరేష్ ఘటానా స్థలానికి వెళ్లి బాధితులతో మాట్లాడి వివరాలు సేకరించారు. టీవీ, ఇతర వస్తువులు ధ్వంసం అయ్యాయని బాధితులు తెలిపారు. ప్రమాదం నష్టం వివరాలు ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి, బాధిత కుటుంబానికి నష్ట పరిహారం మంజూరు చేయిస్తామని ఆర్ఐ శ్రవణ్ కుమార్ తెలిపారు. వారి వెంట కూటమి నేతలు తలారి శంకర్, ఎం.సూరిబాబు తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు

▸▸ భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

నర్సీపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో శనివారం ఏకాదశి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీంతో పలు ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. నర్సీపట్నం వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం కిక్కిరిసి పోయింది. తెల్లవారు జాము నుండి క్యూ లైన్‌లో ఉండి స్వామి వారిని దర్శించుకున్నారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు.





నర్సీపట్నం వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల క్యూ.. రావికమతం: కొత్తకోట ఆలయంలో భక్తుల పూజలు

రావికమతంలో...

రావికమతం: మండల కేంద్రంతో పాటు కొత్తకోట, మేడివాడ, కవ్వగుంట గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిలాడాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు పూజలు, అభిషేకాలు చేయించుకున్నారు. హరహర మహాదేవా.. శివ శంభో.. అంటూ శివ నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. కొత్తకోట శివకేశవస్వామి ఆలయ అర్చకులు విజయభాస్కర్ ఆధ్వర్యంలో అభిషేకాలు, గోత్ర నామ పూజలను విశేషంగా నిర్వహించారు. అలాగే ధ్వజ స్తంభాల వద్ద దీపాలు వెలిగించి భక్తితో పూజలు నిర్వహించారు. రావికమతం శివ పంచాయతన ఆలయంలో రాచకొండ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అభిషేకాలు, హోమం నిర్వహించారు.

రోలుగుంటలో...

రోలుగుంట: మండలంలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కుసర్లపూడి పాకలపాటి గురువు ఆశ్రమం, బుచ్చెంపేట మినీ కైలాసగిరి, రోలుగుంట విశాలక్షి కాశీవిశ్వేశ్వర మృత్యుంజయ ఆలయంలో తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట: వడ్డాది గిరిజాంబ గిరిపై వెలిసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అంగర శ్రీకాంతాచార్యులు, రాధా కృష్ణ ఆధ్వర్యంలో పూజలు, పంచామృత అభిషేకాలు జరిపారు. శనివారం ఏకాదశి కావడంతో పరిసర గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారు జాము నుండే క్యూ లైన్‌లు భక్తులతో కిక్కిరిసాయి. భక్తులు గోవింద నామస్మరణతో గిరిజాంబ గిరి మార్మోగింది. ఆలయ ఈవో శర్మ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



వడ్డాది వెంకన్న దర్శనానికి క్యూలైన్‌లో ఉన్న భక్తులు

మాడుగులలో...

మాడుగుల/మాడుగుల రూరల్: మాడుగుల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు శివాలయాలు, వేంకటేశ్వరస్వామి ఆలయాలకు తరలివెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే మరి కొంతమంది భక్తులు కార్తీక ఏకాదశి ఉపవాస దీక్షలు కొనసాగించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లను చేశారు. కేజే పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తుల వచ్చి పూజల్లో పాల్గొన్నారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: మండలంలోని తిమిరాం శివాలయంలో శనివారం ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి భక్తులు అభిషేకాలు చేయించుకున్నారు. పెదనందిపల్లి, చిననందిపల్లి, బి.కింతాడ, తెనుగుపూడి, శివాలయాలతో పాటు స్థానిక ఉమామహేశ్వరిదేవి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. అలాగే నాగయ్యపేట అయ్యప్ప స్వాముల పీఠం శుక్రవారం రాత్రి అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది.

రూ.5 కోట్లతో కమ్యూనిటీ ఆసుపత్రి అభివృద్ధి

▸▸ అందుబాటులోకి పోస్టుమార్టం సెంటర్

▸▸ ఎక్స్‌రే ప్లాంట్ ప్రారంభం: ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



కమ్యూనిటీ ఆసుపత్రిలో ఎక్స్‌రే ప్లాంట్.ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిని రూ.5 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్టు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రకటించారు. ఆసుపత్రిలో ఎక్స్‌రే ప్లాంట్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి అప్‌గ్రేడ్ చేసేందుకు అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ పనులకు ఇన్‌చార్జి మంత్రి చేతుల మీదుగా త్వరలోనే శంకుస్థాపన చేస్తామన్నారు. ఆసుపత్రిలో అదనపు బెడ్లు మంజూరుతో పాటు అదనంగా డాక్టర్లు, సిబ్బంది కూడా వస్తారని స్పష్టం చేశారు. ఎక్స్‌రే ప్లాంట్ ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలకు ఉచితంగా ఎక్స్‌రే సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని, ఈ సౌకర్యాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఆసుపత్రి ఆవరణలో వృథాగా ఉన్న ఫర్నిచర్, ఇతర పరికరాలను వేలం వేసి, తద్వారా వచ్చిన నిధులను ఆసుపత్రి అభివృద్ధికి ఉపయోగించాలని వైద్యులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం సింహాద్రిపురం మార్గంలో నూతనంగా నిర్మించిన పోస్టుమార్టం సెంటర్‌ను కూడా ప్రారంభించారు. ఈ పోస్టుమార్టం సెంటరుకు అవసరమైన త్రీఫేజ్ సౌకర్యం కోసం చర్యలు తీసుకోవాలని ఈపీడీసీఎల్ ఏఈఈ శ్రీనివాసరాజును ఆదేశించారు. ఇందుకు అవసరమైన నిధులను మండల పరిషత్ నుంచి లేదా, ఆసుపత్రి అభివృద్ధి నిధుల నుంచైనా వెచ్చించాలని సూచించారు. అలాగే పోస్టుమార్టం సెంటరు వద్ద మృతుల బంధువులు కూర్చునేందుకు వీలుగా షెడ్‌ను నిర్మించాలని ఎంపీడీవోకు సూచించారు. శ్మశాన వాటిక ప్రాంతాన్ని కూడా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించామని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లునాయుడు, సకురు కోటేశ్వరరావు, చిన్న, ఆసుపత్రి సూపరింటెండెంట్ దినేష్‌కుమార్, అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరపల్లి వెంకట అప్పారావు, పప్పు శ్రీను, బొబ్బిలి ఈశ్వరరావు, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు రూపాదేవి, ఎలకా మల్లిబాబు, తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు అన్ని విధాలా సాయం

ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితులకు అన్ని విధాలుగా సాయం అందిస్తామని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. మండలంలోని ఆర్లే గ్రామంలో శనివారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థుల నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనుభవం ఫలితంగానే వరద నష్టం పెరగకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. బాధితులను సకాలంలో ఆదుకున్నది ఒక్క తెలుగుదేశం ప్రభుత్వం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. మాడుగుల నియోజకవర్గంలో 380 మంది బాధిత కుటుంబాలను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా సాయం చేస్తున్నదన్నారు. జిల్లా వ్యాప్తంగా పంట పొలాలు ముంపునకు గురయ్యాయన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలను రైతులు పాటించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, డైరెక్టర్ రొంగలి మహేశ్, టీడీపీ నాయకులు సబ్బవరపు రామునాయుడు, బోలెం బుల్లిదొర, కన్నూరు సూర్యనారాయణ, జూరెడ్డి రాము, బండారు ప్రసాద్, కశిరెడ్డి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

కె.కోటపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని నన్నయ్య యూనివర్సిటీ రిటైర్డ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ముర్రు ముత్యాలనాయుడు సూచించారు. మండలంలోని జోగన్నపాలెం, కింతాడ గ్రామాల్లో అయ్యన్న జూనియర్, డిగ్రీ కళాశాలల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాలు నిర్వహించడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాసీం, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కశిరెడ్డి అప్పలనాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు గాడి అప్పారావు, సిముసిరి రమణ, గ్రామ సర్పంచ్ బండారు ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయానికి శంకుస్థాపన

కె.కోటపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూకాంబిక ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మంచినీటి కోనేరు వద్ద గ్రామానికి చెందిన ఎగువవీధి శెట్టి బలిజ కులస్థులు ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. వేద పండితులు హోమం, భూమి పూజ చేశారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

దేవరాపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపడుతున్నామని, దీనికి అందరూ సహకరించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పేర్కొన్నారు. మండలంలోని ఎ.కొత్తపల్లిలో శనివారం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయడానికి యోచిస్తున్న దని చెప్పారు. దీన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించి అడ్డుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం వైసీపీ మండల అధ్యక్షుడు బాబూరావు, సర్పంచ్ చింతల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి జన్మదిన వేడుకలకు పీవీజీ కుమార్‌కు ఆహ్వానం

కె.కోటపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో ఈ నెల 23న జరగనున్న భగవాన్ సత్యసాయిబాబా శతవర్ష జన్మదిన వేడుకలకు రావాలని రాష్ట్ర వెలమ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్‌కు సేవా సంస్థల అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం పీవీజీ కుమార్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

జిల్లేడిపూడి రహదారిలో జంగిల్ క్లియరెన్స్

నాతవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.యర్రవరం నుంచి జిల్లేడిపూడి వరకు రహదారికి ఇరువైపులా పిచ్చి తుప్పలను టీడీపీ నాయకులు శనివారం తొలగించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు కోరుప్రోలు వెంకటేష్ సొంత నిధులతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తాండవ ప్రాజెక్టుకమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ మాట్లాడుతూ ఈ రహదారిలో అడవిని తలపించే విధంగా తుప్పలు పెరిగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఈ దశలో తుప్పలను తొలగించడానికి వెంకటేష్ ముందుకు రావడం అభినందనీమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు ఇనపసప్పల సత్యవతి, ఉప సర్పంచ్ లాలం రామునాయుడు, టీడీపీ నాయకులు అంకంరెడ్డి రామకృష్ణ, సబ్బవరపు స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నగర సంకీర్తన



కొత్తకోటలో నగర సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు

రావికమతం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట పద్మావతి భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో శనివారం శ్రీవెంకటేశ్వరస్వామి నగర సంకీర్తన కార్యక్రమంలో వైభవంగా నిర్వహించారు. ఏకాదశిని పురస్కరించుకుని భజన మండలి సభ్యులు భక్తి గీతాలపనతో గ్రామ పుర వీధుల్లో ఇచ్చిన ఆధ్యాత్మిక ప్రదర్శన అలరించింది. బృంద సభ్యుల గొంతులో గ్రామస్థులు గొంతు కలపడంతో భక్తి గీతాలపన అందరినీ ఆకట్టుకుంది. స్వామివారి చిత్రపటంతో గ్రామంలో కలయ తిరిగారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో ప్రజల ఇక్కట్లు



బుచ్చెంపేట పీహెచ్‌సీ రోడ్డు పక్కన ప్లాస్టిక్ వ్యర్థాలు

రోలుగుంట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుచ్చెంపేట నుంచి ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రోడ్డు పక్కన ప్లాస్టిక్ వ్యర్థాలు పడేయడంతో దుర్వాసన వెదజల్లుతున్నది. దీంతో వాహన చోదకులు, పీహెచ్‌సీకి వెళ్లే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరుబయట చెత్తవేయరాదని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, క్షేత్ర స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. కొన్ని నెలలుగా ఈ మార్గం వెంబడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పడేస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

నేడు ఇన్‌చార్జి మంత్రి పర్యటన

చోడవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర మండలంలో ఆదివారం పర్యటించనున్నట్టు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు రాయపురాజుపేటలో భూలోకమాంబను దర్శించుకున్న అనంతరం, గ్రామంలోని ఊటగెడ్డ, ఎర్రగెడ్డ వంతెనను మంత్రి పరిశీలించనున్నట్టు తెలిపారు. అనంతరం భోగాపురం గవరవరం గ్రామాల్లో తుఫాన్‌కు దెబ్బతిన్న వంతెనతో పాటు గవరవరంలో వంతెనను కూడా పరిశీలిస్తారని ఆయన చెప్పారు. అలాగే బుచ్చెయ్యపేట మండలంలోని వడ్డాదిలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు కుమారుడి వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని వివరించారు. మంత్రి పర్యటనలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.


నాగదేవతల విగ్రహాల ప్రతిష్ఠ

రావికమతం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో మరుపాక శివారు గొల్లలపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన నాగేంద్ర, నాగదేతల ఆలయలో శనివారం విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం జరిగింది. ఎంపీటీసీ సభ్యుడు ముచ్చా సూర్యనారాయణ, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలు

నర్సీపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ జిల్లా స్థాయి ప్రతిభా పాఠశ పోటీలలో భాగంగా రెండో రోజు శనివారం దేశ భక్తి గీతాలు పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 4, 5, 6 తరగతులు జూనియర్, 7, 8, 9 తరగతుల విద్యార్థులను సీనియర్లుగా విభజించి పోటీలు పెట్టారు. ఈ పోటీలో వివిధ పాఠశాలల నుంచి 100 బృందాలు పాల్గొన్నాయని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ తెలిపారు. పోటీలకు శాంతాలక్ష్మి, వరలక్ష్మి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారని ఆయన చెప్పారు.

నేడు భూలోకమాంబ జాతర



చోడవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపురాజుపేట గ్రామంలో ఆదివారం భూలోకమాంబ జాతర నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం నుంచి ఉత్సవ విగ్రహం ఊరేగింపుతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జాతర సందర్భంగా పల్సర్ బైక్ ఝాన్సీ టీముతో మెగా డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, జాతరను విజయవంతం చేయాలని గంగాధర్ విజ్ఞప్తి చేశారు.

పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు

నాతవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జనసేన నర్సీపట్నం నియోజకవర్గం ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో శనివారం పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. తుఫాన్ బాధిత మహిళలకు చీరలు అందించారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ తుఫాన్ సమయంలో గ్రామాలను కార్మికులు కష్టపడి పరిశుభ్రం చేశారన్నారు. వారికి ఉడతభక్తిగా దుప్పట్లు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. అలాగే నిరుపేదలకు దాతలు సాయం అందించి మనవత్వం చాటుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పోలుపర్తి శ్రీనివాసరావు, గుడివాడ కృష్ణ, మాకిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

రహదారులపై చెత్త తొలగింపు

గొలుగొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రహదారులపై తుఫాన్ వర్షాలకు పేరుకుపోయిన చెత్తను శనివారం తొలగించారు. అయ్యన్నపాలెం జంక్షన్ నుంచి కృష్ణాదేవిపేట వరకు రోడ్డుపై పేరుకుపోయిన చెత్తను తొలగించాలని సంబంధిత శాఖాధికారులను స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. ఈ మేరకు గుండుపాల, చీడిగుమ్మల, ఎర్రవరం గ్రామం వరకు ఈ కార్యక్రమం చేపట్టారు. అలాగే ప్రధాన రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన పిచ్చి తుప్పలను తొలగించారు. దీంతో వాహన చోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బి.కింతాడ సబ్ స్టేషన్ పరిధిలో ములకలాపల్లి, కొత్తపెంట గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగు తుందని ఏపీ ఈపీడీసీఎల్ ఏఈఈ కర్రి శంకరరావు తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. లైన్ల మరమ్మతు పనుల కారణంగా సరఫరా నిలిపి వేస్తున్నామని, వినియోగదారులు గమనించాలని కోరారు.

ద్విచక్ర వాహనం దగ్ధంపై ఫిర్యాదు

మాకవరపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో రాచపల్లి గ్రామంలో ద్విచక్ర వాహన దగ్ధంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాచపల్లి గ్రామానికి చెందిన రుత్తల ప్రసాద్ శుక్రవారం రాత్రి అంజనేయ స్వామి గుడికి ఎదురుగా ఉన్న ఓ దుకాణం వద్ద తన ద్విచక్ర వాహనాన్ని ఉంచి గ్రామంలోకి వెళ్లారు. అక్కడ నుంచి రాత్రి 11 గంటలు దాటిన తర్వాత వాహన వద్దకు వచ్చి చూసేసరికి పూర్తిగా కాలిపోయి ఉంది. దీంతో శనివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు తన వాహనాన్ని తగలబెట్టారని ఎస్ఐ దామోదర నాయుడుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

బుచ్చెయ్యపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలిపల్లి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రంగా గాయాలు తగిలాయి. మండల పరిషత్ కార్యాలయంలో టైపిస్ట్‌గా పనిచేస్తున్న నరేంద్ర శనివారం కార్యాలయంలో విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై చోడవరం వెళ్తున్నాడు. పోలేపల్లికి సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం అతన్ని ఢీకొంది. దీంతో కిందపడిపోయి నరేంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 వాహనానికి సమాచారం అందించారు. దాదాపు ఏడు గంటల వరకు వేచి చూసినప్పటికీ వాహనం రాలేదు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీవో శివప్రసాద్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. వెంటనే ప్రైవేట్ అంబులెన్స్ రప్పించి అనకాపల్లిలోని ఆస్పత్రికి తరలించారు.

సంతానలేమితో సతమతం

పెరుగుతున్న సమస్య

- అవగాహన అత్యంత కీలకం
- సకాలంలో వైద్య సేవలు పొందితే పరిష్కారం
- నేడు వరల్డ్ ఫెర్టిలిటీ డే



విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): **గడిచిన కొన్నాళ్లుగా సంతానలేమి సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా కొన్ని లక్షల మంది దంపతులు సంతాన లేమితో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో సంతాన లేమి సమస్యపై ప్రజల్లో అవగాహన కలిగించే ఉద్దేశంతో వరల్డ్ ఫెర్టిలిటీ డే నిర్వహిస్తూ వస్తున్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, ఆరోగ్యకరమైన జీవన విధానాలను అలవాటు చేసుకునేలా ప్రోత్సహించే ఉద్దేశంతో దీన్ని నిర్వహి స్తున్నారు. సంతానలేమి సమస్యపై ఉన్న ఆలోచనలు, బయటకు చెప్పలేని స్థితిని బహిరంగంగా మాట్లాడడం ద్వారా తొలగించడం, అవగాహన కలిగించడం అన్న థీమ్‌తో ఈ ఏడాది ఫెర్టిలిటీ డే నిర్వహిస్తున్నారు.**



పెరుగుతున్న సమస్య..

గతంతో పోలిస్తే సంతాన లేమి సమస్య ఎక్కువైంది. ప్రతి వంద మందిలో పది నుంచి 15 మంది దంపతులు సంతానలేమి సమ స్యతో బాధపడుతున్నట్టు వైద్య నిపుణులు చెబుతున్నారు. పెరుగు తున్న ఈ సమస్యకు అనుగుణంగానే ఐవీఎఫ్ సెంటర్లు పెద్ద ఎత్తున వెలుస్తు న్నాయి. ఇప్పటికే జిల్లాలో పదుల సంఖ్యలో ఇవి ఉన్నాయి. సంతాన లేమి సమస్య గడిచిన పదేళ్లలో రెండు నుంచి మూడు రెట్లు పెరిగినట్టు నిపుణులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో మరింతగా ఈ సమస్య పెరిగే అవకాశం ఉంది. సంతానలేమి సమస్యకు ప్రధానంగా ఆలస్యంగా పెళ్లి చేసుకోవడం, పెళ్లి చేసుకున్నా అనేక కారణాలతో పిల్లలను కనడాన్ని వాయిదా వేసుకోవడం, పాలిస్టిక్ ఒవరీస్, వాతావరణ కాలుష్యం వంటివన్నీ సమస్యగా వైద్యులు చెబుతున్నారు.

ఎప్పుడు సమస్యగా భావించాలి..

వివాహం జరిగిన ఏడాదికో, రెండేళ్లకో పిల్లలు పుట్టకపోవడాన్ని సంతాన లేమి సమస్యగా భావించకూడదు. కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించకుండా వివాహం జరిగి ఏడాది దాటినా సంతానం కలగకపోతే కొంతవరకు అనుమానించాలి. మరో ఏడాది వరకు నిరీక్షించినా ప్రయోజనం లేకపోతే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యను తెలుసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

అనేక కారణాలు..

సంతాన లేమి సమస్య పూర్తిగా యువతులకు సంబంధించినదిగా చాలా మంది భావిస్తుంటారు. యువతీ, యువకులు ఇద్దరిలో ఏ ఒక్కరికి సమస్య ఉన్నా సంతానం కలిగేందుకు అవకాశం ఉండదు. పురుషుల్లో అయితే శుక్రకణాలు తక్కువగా ఉండడం (స్పెర్మ్ కౌంట్), కదలిక సరిగా లేకపోవడం, ఆధునిక జీవనశైలి, పొగ తాగడం, మద్యం తీసుకోవడం వంటి అలవాట్లు సంతాన లేమి సమస్యకు కారణమవుతుంటాయి. యువతుల్లో అయితే పాలిస్టిక్ ఓవరీస్ సమస్య ఒకప్పుడు అధికంగా ఉండేది. ప్రస్తుతం ఎగ్ రిలీజ్ కాకపోవడం ప్రధాన సమస్యగా మారింది. సంతానలేమితో బాధపడే మహిళల్లో ఎక్కువ మందిని ఈ సమస్య వేధిస్తోంది. మహిళల్లో ఎగ్స్ తక్కువగా ఉంటున్నాయి. 20, 30 ఏళ్ల యువతుల్లో కూడా 40 ఏళ్ల మహిళల్లో ఉంటున్నట్టుగా ఎగ్స్ ఉంటున్నట్టు నిపుణులు చెబుతున్నారు. ఎగ్స్ తక్కువగా ఉండడానికి అనేక కారణాలున్నాయి. టాక్సిన్స్, థైరాయిడ్, డయాబెటిస్, కొన్నిరకాల ఇన్‌ఫెక్షన్స్ వల్ల ఎగ్స్ తక్కువగా ఉంటున్నాయి. ఒకప్పుడు ఈ సమస్య రెండు, మూడు శాతం మంది మహిళల్లో ఉంటే ఇప్పుడు పది నుంచి 15 శాతం మందికిపైగా వేధిస్తోంది. ఒబెసిటీ వల్ల ఎగ్ క్వాలిటీ తగ్గింది. ఇన్‌ఫెక్షన్స్ వల్ల ట్యూబ్స్ బ్లాక్ కావడం, కొన్ని రకాల క్యాన్సర్లు సంతానలేమి సమస్యకు కారణమవుతున్నాయి. ఈ తరహా ఇబ్బందులు ఉన్న జంటలు నిపుణులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలి.

జీవన విధానంలో మార్పులు అవసరం..

జీవన విధానంలో కొన్ని రకాల మార్పులు చేసుకోవడం ద్వారా సమస్యను పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంది. వీలైనంత వరకు 30 ఏళ్లలోపు వివాహం చేసుకోవాలి. ఒత్తిడికి దూరంగా ఉండేలా చూసుకోవాలి. సరైన నిద్ర ఉండాలి. విటమిన్ డి సమస్య లేకుండా జాగ్రత్తపడాలి. పిల్లల కోసం ప్లానింగ్ చేసుకునేటప్పుడు స్మోకింగ్, ఆల్కహాల్ వంటి అలవాట్లను తగ్గించుకోవాలి. జంక్ ఫుడ్, బయటి ఫుడ్‌కు దూరంగా ఉండాలి. బరువును నియంత్రించుకోవాలి. రోజువారీ వ్యాయామం చేయాలి. పోలిక్ యాసిడ్ వంటి సంప్లిమెంట్స్‌ను తీసుకోవాలి. థైరాయిడ్, షుగర్ వంటి అనారోగ్య సమస్యలు ఉంటే నిపుణులను సంప్రదించి వాటిని నియంత్రణలో ఉంచుకోవాలి.

సమస్యను వేగంగా గుర్తించడం అత్యంత కీలకం



సంతాన లేమితో బాధపడుతున్న జంటల సంఖ్య పెరుగుతోంది. ఒకప్పుడు వందలో ఇద్దరో, ముగ్గురిలో ఈ సమస్య ఉండేది. ఇప్పుడు 10 మందికి పైగా ఈ సమస్యతో బాధపడుతున్నారు. ఘోష ఆస్పత్రికి వచ్చే వంద మందిలో 15 మంది వరకు జంట లకు సంతాన లేమి సమస్యలు ఉంటున్నాయి. పరీక్షలు నిర్వహిస్తే స్పెర్మ్ కౌంట్ తక్కువగా ఉండడం, ఎగ్స్‌లో ఇబ్బందులు, ట్యూబ్ బ్లాక్స్, గర్భ సంచిలో పొరలు ఉండడం వంటివి ఉంటున్నాయి. ఈ ఇబ్బందులను గుర్తించి వారికి అవసరమైన వైద్య చికిత్సలు చేస్తున్నాం. అయితే, జీవన విధానంలో వచ్చిన మార్పులు, ల్యాప్‌టాప్‌లో శరీరంపై పెట్టుకుని పని చేయడం వంటి చర్యల వల్ల ఈ సమస్య పెరుగుతోంది. జంక్ ఫుడ్, స్మోకింగ్ అలవాట్లు తీవ్రతను పెంచుతున్నాయి. 30 ఏళ్లు దాటినంత వరకు చాలా మంది అమ్మాయిలు పెళ్లిళ్లు చేసుకోవడం లేదు. పెళ్లి తరువాత స్వేచ్ఛ అంటూ మరో రెండు, మూడేళ్లు పిల్లలను వద్దని అనుకుంటున్నారు. అప్పటికే వారిలో సమస్యలు ఉంటున్నాయి. వారికి అది తెలియడం లేదు. పిల్లలు కావాలనుకునే సమయానికి సమస్య పెరిగి మరిన్ని ఇబ్బందులకు కారణమవుతోంది. సంతానం విషయంలో దంపతులకు స్పష్టమైన అవగాహన ఉండడం అత్యంత కీలకం.

- డాక్టర్ ప్రసాద్ ఉష,
ఘోష ఆస్పత్రి సూపరింటెండెంట్

పింఛన్ల పంపిణీ తీరుపై ఆరా

- లబ్ధిదారులకు స్వయంగా అందజేసిన కలెక్టర్



శంకరం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను అందజేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి లబ్ధిదారునికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ సక్రమంగా అందేలా చూడాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టర్ శనివారం అనకాపల్లి మండలం శంకరం గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు అందించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ల పంపిణీ విధానంపై ఆరా తీసి సక్రమంగా, సకాలంలో అందుతున్నది, లేనిది వాకబు చేశారు. పింఛన్లు అందిస్తున్నప్పుడు సిబ్బంది తీరును అడిగి తెలుసుకున్నారు. వృద్ధాప్య పెన్షను పొందుతున్న మద్దిరాల మరియమ్మ, వంకర అప్పల నర్సమ్మ, గూనూరు చిన అప్పారావులకు, వితంతు పెన్షను పొందుతున్న కొత్తపల్లి సౌభాగ్య లక్ష్మిలకు పెన్షన్లు అందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శచీదేవి, మండల అభివృద్ధి అధికారిణి ఆశాజ్యోతి, పంచాయతీ సెక్రటరీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్‌సీ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా సుశీల్ మీనన్

విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తూర్పు నౌకాదళం చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా వైస్ అడ్మిరల్ సుశీల్ మీనన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 1992లో నేవీలో ప్రవేశించారు. తుపాకులు, క్షిపణులు ప్రయోగించడంలో ప్రత్యేక నైపుణ్యం ఉంది. మూడు దశాబ్దాల సర్వీస్‌లో అనేక ఆపరేషన్లు, శిక్షణలు, సిబ్బంది నియామకాల్లో కీలకంగా వ్యవహరించారు. భారత యుద్ధనౌకలు రణ్‌విజయ్, తల్వార్‌లో గన్నరీ అధికారిగా, ముంబై నౌకకు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేశారు. టీఆర్‌వీ-71, కిర్పాణ్, డెస్ట్రోయర్ కోల్‌కత్తా, ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ విక్రమాదిత్యలకు కమాండింగ్ అధికారిగా బాధ్యతలు నిర్వహించారు. 2023 మే నెలలో రియర్ అడ్మిరల్ ర్యాంకు పొందారు. తూర్పు నౌకాదళంలో ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్‌గా 2024 ఆగస్టులో పనిచేశారు. తన సేవలను మెచ్చి ప్రభుత్వం 2019లో విశిష్ట సేవా మెడల్‌తో సత్కరించింది.

ఉపమాక క్షేత్రం కిటకిట

- ఆలయానికి పోటెత్తిన భక్తులు



విశేష అలంకరణలో స్వామివారు



ఉపమాక వెంకన్న దర్శనానికి బారులుతీరిన భక్తులు

నక్కపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక శ్రీవేంకటేశ్వర స్వామి క్షేత్రం కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉమ్మడి విశాఖ జిల్లా, కాకినాడ ,శ్రీకాకుళం జిల్లా నుంచి వేల సంఖ్యలో భక్తులు ఉపమాక ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ప్రాంగణమంతా ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయ ధ్వజస్తంభం వద్ద పెద్ద సంఖ్యలో మహిళలు పుణ్యదీపాలు వెలిగించారు. ఆలయ ఆస్థానమండపం ప్రాకారమంతా భక్తుల క్యూ లైన్లతో నిండిపోయింది. భక్తుల గోవిందనామస్మరణతో ఆలయం మార్మోగిపోయింది. అంతకు ముందు కొండపైన, కింద వున్న ఆలయాల్లో స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయిగోపాలాచార్యులు, రంగాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు.

తాండవ నుంచి 1,237 క్యూసెక్కుల నీరు విడుదల

పాయకరావుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తాండవ జలాశయంలోకి వరద నీరు అధికంగా వస్తున్న నేపథ్యంలో నదిలోకి 1,237 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామని తహశీల్దార్ ఎస్‌ఏ మహేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తాండవ జలాశయం గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా, ప్రస్తుతం 378.80 అడుగులకు చేరిందన్నారు. జలాశయంలోకి సుమారు 1,500 క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లో వస్తున్నందున జలాశయం స్పిల్ వే ద్వారా అవుట్ ఫ్లో 1,237 క్యూసెక్కులు నీటిని విడిచి పెడుతున్నామని పేర్కొన్నారు.

కోనాం జలాశయం నుంచి..

చీడికాడ: మండలంలో కోనాం జలాశయం నుంచి శనివారం కూడా 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా ప్రస్తుతం 98.80 మీటర్లకు చేరుకుందని ఇరిగేషన్ ఏఈ టీబీ సత్యనారాయణ దొర తెలిపారు. జలాశయం ఎగువ నుంచి 200 క్యూసెక్కులు నీరు వస్తుండగా.. మెయిన్ గేట్లు ద్వారా 200 క్యూసెక్కుల నీటిని బొడ్డేరు నదిలోకి విడుదల చేస్తున్నామని ఆయన తెలిపారు.

పెద్దేరు నుంచి..

మాడుగుల రూరల్ : మండలంలోని పెద్దేరు జలాశయానికి వరద తాకిడి కాస్త తగ్గింది. తుఫాన్ వర్షాలకు జలాశయంలో వరద నీరు పోటెత్తడంతో రెండు గేట్లు ఎత్తి నీటిని విడిచిపెట్టారు. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా, శనివారం సాయంత్రానికి 135 మీటర్లకి చేరింది. దీంతో జలాశయం ఒక గేటు తెరిచి 300 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెట్టారు.

మత్స్యకారులకు అండగా నిలుస్తాం

- బల్క్‌డ్రగ్ పార్కు వ్యతిరేక పోరాటానికి పూర్తి మద్దతు
- సంఘీభావం తెలిపిన వామపక్ష పార్టీల నాయకులు



బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా సంఘీభావం ప్రకటించిన వామపక్షాల నేతలు

నక్కపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట గ్రామంలో బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా మత్స్యకారులు చేస్తున్న ఉద్యమానికి తాము అండగా నిలుస్తామని, ఈ పోరాటానికి పూర్తి మద్దతు వుంటుందని రాష్ట్రంలోని పలు వామపక్ష పార్టీలకు చెందిన రాష్ట్ర నాయకులు హామీ ఇచ్చారు. శనివారం రాజయ్యపేటలో 48వ రోజుకు చేరుకున్న నిరసన దీక్షా శిబిరాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి బి.ఈశ్వరయ్య, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం సహా సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, సీపీఐ ఎంఎల్, న్యూ డెమోక్రసీ సహా పలు వామపక్షాల నాయకులు సందర్శించి మత్స్యకారులకు పూర్తి మద్దతు ప్రకటించారు. అనంతరం మత్స్యకారులనుద్దేశించి సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు మాట్లాడారు. ప్రజల ప్రాణాలను, పర్యావరణాన్ని నాశనం చేసే బల్క్‌డ్రగ్ పార్కులను ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే హెటిరో పరిశ్రమ వదులుతున్న వ్యర్థ రసాయన జలాలు వలన పర్యావరణం, సముద్ర జలాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వెలిబుచ్చారు. మత్స్యకారులు వేట లేక వలసపోతున్నారన్నారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు పోలా ఈశ్వరరావు, సీపీఐ ఎంఎల్ నాయకులు ఎంఎస్ నాగరాజు పాల్గొన్నారు.

విపత్తుల నిర్వహణకు సమగ్ర ప్రణాళిక

... 5వ పేజీ తరువాయి

అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సమన్వయంతో పని చేయడం గొప్ప విషయమన్నారు. అధికారుల ద్వారా అనుభవాలను తెలుసుకున్న కలెక్టర్ భవిష్యత్తులో ఎటువంటి విపత్తులు ఎదురైనా మరింత ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. జిల్లాలో ప్లాస్టిక్ అతి పెద్ద సమస్యగా మారిందని, ప్లాస్టిక్ కవర్లు, సీసాలు వలన కాలువల్లో చెత్త పేరుకుపోయి మూసుకుపోతున్నాయన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు.

సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

క్రైం... crime news

గేదెల కోసం చెరువులో దిగి ఒకరి మృతి



వెంకటరమణరాజు (ఫైల్ ఫొటో)

సబ్బవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాటజంగాలపాలెం గ్రామం రాజుగారి బంజరి వద్ద సాగునీటి చెరువులో దిగిన గేదెలను ఒడ్డుకు చేర్చే ప్రయత్నం లో ఓ వ్యక్తి మృతి చెందారు. దీనికి సంబంధించి పోలీసులు శనివారం తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. రాజుగారి బంజరికి చెందిన ఇందుకూరి వెంకటరమణరాజుకు పాడి పశువులు ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం ఆయన ఆవులు, గేదెలను బంజరి సమీపంలోని తోటలోకి మేతకు తోడ్కొని వెళ్లారు. అయితే అక్కడకు సమీపంలో చిక్కాలవానిచెరువులోకి పాడి గేదెలు దిగాయి. వెంకట రమణరాజు ఎంత ప్రయత్నించినా గేదెలు ఒడ్డుకు రాలేదు. గేదెలను ఒడ్డుకు తీసుకురావడానికి చెరువులో దిగి ఆయన గల్లంతయ్యారు. చీకటి పడుతున్నా ఆయన ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. చెరువు ఒడ్డున ఆయన చెప్పులు కనిపించడంతో రాత్రి 11 గంటల వరకు చెరువులో వెదికారు. ఫలితం లేకపోవడంతో శనివారం ఉదయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ జి.రామచంద్రరావు సిబ్బంది, గజ ఈతగాళ్ల సహాయంతో చెరువులో గాలించగా ఉదయం 10 గంటల సమయంలో మృతదేహం లభ్యమైంది. మృతుడి సోదరుని కుమారుడు ఇందుకూరి లచ్చిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య వెంకటలక్ష్మీ, కుమారుడు నవీన్‌కుమార్ ఉన్నారు.

నేడు డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా రాక

- పోలీస్ మెస్ ఆధునికీకరణకు శంకుస్థాపన
- అనంతరం 14 స్టార్ హోటళ్లతో ఒప్పందం
- పెట్టుబడుల సదస్సుకు భద్రతా ఏర్పాట్లపై సాయంత్రం సమీక్ష

విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీస్ శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) హరీష్‌కుమార్‌గుప్తా ఆదివారం విశాఖ రానున్నారు. ఉదయం పది గంటలకు బీచ్‌రోడ్డులోని పోలీస్ మెస్‌కు చేరుకుంటారు. మెస్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అక్కడి నుంచి పోలీస్ కమిషనర్ కార్యాలయానికి వెళతారు. ఐపీఎస్ అధికారులకు బస కల్పించే అంశంపై నగరంలోని 14 స్టార్ హోటళ్లతో డీజీపీ ఒప్పందం చేసుకుంటారు. అనంతరం కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు వెళ్లి పది వేల కిలోల గంజాయిని నిర్వీర్యం చేసే కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం నాలుగు గంటలకు పోలీస్ కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో సీఐఐ సదస్సుకు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లపై ఉత్తరాంధ్రలోని పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తారు.

వచ్చే నెల 6న వన్డే భారత్, దక్షిణాఫ్రికా మధ్య మ్యాచ్

- వేదికగా ఏసీఏ-వీడీసీఏ స్టేడియం

విశాఖపట్నం, స్పోర్ట్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మరో వన్డే మ్యాచ్‌కు విశాఖ ఆతిథ్యమివ్వనుంది. పోతినమల్లయ్యపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో వచ్చే నెల (డిసెంబరు) 6న భారత్, దక్షిణాఫ్రికా మధ్య మ్యాచ్ నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈనెల 14 నుంచి వచ్చే నెల 19 వరకు భారత్‌తో పర్యటించనున్న దక్షిణాఫ్రికా జట్టు రెండు టెస్టులు, మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు ఆడనున్నది. వన్డే సిరీస్‌లో తొలి మ్యాచ్ రాంచీ, రెండో మ్యాచ్ రాయపూర్‌లో జరగనుండగా...డిసెంబరు 6న జరగనున్న మూడో వన్డేకు ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదిక కానుంది. ఇప్పటివరకూ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో మూడు టెస్టులు, 10 వన్డేలు, నాలుగు టీ20 మ్యాచ్‌లు జరిగాయి. 11వ వన్డే మ్యాచ్ నిర్వహణకు ఏసీఏ ప్రతినిధులు సిద్ధమవుతున్నారు.

తుఫాన్ చేసిన గాయాలు

... 5వ పేజీ తరువాయి

గుర్రయ్యాయి. మాడుగుల మండలం ముకుందపురం నుంచి వంటర్లపాలెం వరకు 100 మీటర్ల పొడవున పంచాయతీరాజ్ శాఖకు చెందిన రోడ్డు పూర్తిగా పాడైంది. మునగపాక మండలం కొండకర్ల ఆవ, గుణపర్తి కల్వర్టు, చీడికాడ మండలం జి.కొత్తూరులో కల్వర్టు కూలిపోయింది. అనకాపల్లి నుంచి వయా తుమ్మపాల, వెంకన్నపాలెం, చోడవరం, వడ్డాది, మాడుగుల వెళ్లే రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఎస్.రాయవరం మండలం నుంచి నర్సీపట్నం వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డుపై కొన్నేళ్లుగా పెద్ద పెద్ద గొయ్యిలు ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ రోడ్డుపై అడుగుకో గొయ్యి ఏర్పడింది. వర్షాలు తగ్గినా రోడ్లపై భారీ గుంతలు ఏర్పడడంతో రాకపోకలు సాగించే వృద్ధులు, చిన్నారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఛిద్రమైన రోడ్లకు తాత్కాలిక మరమ్మతులైనా వెంటనే చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు. కాగా జిల్లాలో వర్షాలకు దెబ్బతిన్న రహదారుల వివరాలను ప్రభుత్వం దృష్టిలో పెట్టామని ఆర్ అండ్ బీ ఈఈ నందమూరి సాంబశివరావు తెలిపారు. ప్రస్తుతం రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పెద్ద గుంతలను పూడ్చుతున్నామని చెప్పారు. పరిపాలనాపరమైన అనుమతులు రాగానే రోడ్ల నిర్మాణ పనులు చేపడతామని ఆయన తెలిపారు.

భౌబోయ్ అరుస్తాయ్.. కరుస్తాయ్

... 5వ పేజీ తరువాయి

నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో 700 మందికి వైద్యులు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేశారు. నర్సీపట్నం నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మూడు అర్బన్ పీహెచ్‌సీలలో 1,841 మందికి వ్యాక్సిన్ వేశారు. జిల్లాలో జూలైలో 819, ఆగస్టులో 1,463, సెప్టెంబరులో 1494, అక్టోబరులో 1,804 మంది చొప్పున మొత్తం 5,580 మంది బాధితులు ఉన్నారు. కుక్కలు నివారణకు వాటి సంతానం పెరగకుండా శస్త్ర చిక్కిత్సలు చేయడం ఒక్కటే మార్గమని అధికారులు అంటున్నారు. శస్త్ర చికిత్సలు చేసి కాలక్రమేణా కుక్కల బెడద తగ్గించుకోవడం తప్పితే వేరే మార్గం లేదని అంటున్నారు. నర్సీపట్నం మునిసిపాలిటీలో 244, ఎలమంచిలి మునిసిపాలిటీలో 140 పైగా కుక్కలకు శస్త్ర చికిత్సలు చేయించారు. ఆపరేషన్ చేయడానికి ఒక్కొక్క కుక్కకి రూ.1500 ఖర్చు చేశారు. అయితే పంచాయతీల్లో ఇటువంటి ప్రయత్నం ఏమీ చేయడం లేదు. ఖర్చుతో కూడుకున్న పని కావడంతో కుక్కల నివారణకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేయడం తప్పితే కుక్కల నివారణకు ఏమీ చేయలేకపోతున్నారు. దీనిపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి హైమావతిని వివరణ కోరగా జిల్లాలో యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ కొరత లేదని తెలిపారు.

ముత్యాలమ్మపాలెం తీరంలో విద్యార్థి గల్లంతు

... 5వ పేజీ తరువాయి

బాలుర వసతి గృహంలో ఉంటూ అదే గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న సూరెడ్డి భానుప్రసాద్ (15) (రావికమతం మండలం తోటకూరపాలెం), మొల్లి చందు (అనకాపల్లి మండలం కొత్తూరు), రాయుడు దుర్గాప్రసాద్ (పరవాడ మండలం తానాం), మర్లపల్లి సిద్ధూ (అచ్యుతాపురం మండలం మడుతూరు)తో పాటు తొమ్మిదో తరగతి చదువుతున్న సిమ్మ రామ్‌చరణ్ (అనకాపల్లి రూరల్ మండలం వల్లూరు) కలిసి శనివారం పాఠశాలకు డుమ్మా కొట్టారు. ముత్యాలమ్మపాలెం సముద్రతీరంలో స్నానాలు చేసేందుకు వెళ్లారు. ఐదుగురూ స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన కెరటానికి వారంతా సముద్రం లోపలకు కొట్టుకుపోయారు. ఈ విషయాన్ని ఒడ్డున ఉన్న మత్స్యకారులు గమనించి వెంటనే కొట్టుకుపోతున్న వారిలో నలుగురిని రక్షించగా, భానుప్రసాద్ గల్లంతయ్యాడు. అతని కోసం ఎంత గాలించినా ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు తీరానికి చేరుకొని అప్పటికే అక్కడున్న సీఐ ఆర్. మల్లికార్జునరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా గల్లంతైన భానుప్రసాద్ కోసం డ్రోన్ సహా యంతో వెతికినా ఫలితం లేకపోయింది. ఆచూకీ కోసం కుటుంబసభ్యులు తీరం వద్ద ఎదురుచూస్తున్నారు. ఈ సంఘటనపై సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574